కాకినాడ గ్రామీణ ప్రాంతానికి చెందిన గర్భిణి ప్రసవ వేదనతో నగరంలోని ఆసుపత్రిలో చేరారు. అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వచ్చింది. నెగిటివ్ గ్రూప్ కావడంతో దొరకలేదు. అధికారుల చొరవ వల్ల ఓ దాత ముందుకు రావడంతో ప్రాణాపాయ స్థితి తప్పింది.



వీరవరం యండపల్లికి చెందిన వ్యక్తి(38)కి డెంగీ జ్వరంతో ప్లేట్‌లెట్లు పడిపోయాయి. పరిస్థితి విషమించింది. ఆయనది అరుదైన దొరకే ఏబీ పాజిటివ్ గ్రూప్ కావడంతో అర్ధరాత్రి వేళ కాకినాడ యువసేన సభ్యుడు అవినాష్ సకాలంలో దానమిచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం.. నేటికీ ఎందరో అత్యవసర వేళ ఇబ్బందులు పడుతున్నారు. రక్తనిధి కేంద్రాల్లో దొరికే వనరులగానే చాలామంది చూస్తున్నారు తప్ప.. దానమిచ్చేందుకు ముందుకు వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉంది. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం. అపోహలు వీడి ముందుకొచ్చి దానం చేయడం ద్వారా పదుగురి ప్రాణాలు కాపాడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

నీ రక్తదానం.. నిలుపు ప్రాణం

- అత్యవసర వేళల్లో రోగులకు ఇబ్బందులు
- అపోహలు వీడి చైతన్యం పెరగాల్సిన ఆవశ్యకత

గాంధీనగర్, మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 28 రక్తనిధి కేంద్రాలు (బ్లడ్ బ్యాంకులు) ఉన్నాయి. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండగా.. మరో రెండు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్‌లు నిర్వహిస్తున్నాయి. ఇంకో 6 ప్రైవేట్ రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో అమలాపురం, రాజోలు ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్కోటి అమలాపురంలో 6 ప్రైవేట్‌వి ఉన్నాయి. తూర్పులో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఒకటి, ప్రైవేట్‌లు 9 నడుస్తున్నాయి.. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, చిరంజీవి వంటి నేతల, ప్రముఖుల జన్మదినోత్సవాలు, పలు సంస్థల వారోత్సవాల్లో శిబిరాలు ఏర్పాటు చేయడంతో కొంత కొరత తీరుతోంది. ప్రైవేటు కేంద్రాలు సేకరిస్తున్న రక్త నిల్వల్లో 30 శాతం ప్రభుత్వ రక్తనిధికి ఇవ్వాలనే నిబంధన ఉంది. ఆ వేసవిలో మాత్రం సమస్య తీరడం లేదు. ఆ సీజన్‌లో తలసేమియా, డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అందరిలోనూ చైతన్యం పెరిగితేనే రోగుల అవసరాలు తీరుతాయి.

700 మందిని గుర్తించి..

సామాజిక మాధ్యమాల్లో రక్తదానం, దాతలపై అవగాహన సందేశాలతో కొంత ఆయోమయం నెలకొంటుంది. నెగిటివ్ గ్రూప్ దాతలు శిబిరాల్లో కావడంతో నేరుగానే బాధితులకు అందజేస్తామంటున్నారు. ఇది మంచి పరిణామమైనా ఒక్కోసారి రోగులకు దాతలు దొరక్క ఇబ్బంది ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలోని అధికారులు నెగిటివ్ గ్రూప్ కలిగిన సుమారు 700 మందిని గుర్తించారు. వారిని అత్యవసర సమయాల్లో సంప్రదిస్తూ.. కొరత తీర్చేందుకు కొంతవరకు కృషి చేస్తున్నారు.

జిల్లా	రక్తనిధి కేంద్రాలు
కాకినాడ	10
తూర్పుగోదావరి	10
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	8



కాకినాడ సూర్యకళా మందిరంలో మెగా రక్తదాన శిబిరం (పాతచిత్రం)

గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలో రక్తనిధి కేంద్రాల ద్వారా సేకరణ ఇలా..

సంవత్సరం	లక్ష్యం (యూనిట్లు)	సేకరణ	శాతం
2022–23	53928	79668	148
2023–24	53928	81642	151
2024–25	53928	26381	117

(ఆగస్టు 2024 వరకు)

ప్రతి మూడు నెలలకు ఒకసారి..

కాకినాడ జీజీహెచ్‌లో రక్తం అవసరం ఉంది. రోడ్డు ప్రమాదాలు, డెలివరీ కేసులు, మలేరియా, డెంగీ, విష జ్వరాలతో ఎప్పుడూ వస్తుంటారు. దాతలందరికీ ఉచితంగా రక్తం అందజేస్తున్నాం. 19 నుంచి 60 ఏళ్ల వయస్సు వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. ఆర్మీ, నేవీ సిబ్బంది ఎవరూ చెప్పకుండానే స్వచ్ఛందంగానే చేస్తారు. మనం కూడా అలా ఆలోచించి చేస్తే చాలావరకు కొరత తీరుతుంది.
-డా.శారదాదేవి, మెడికల్ అధికారిణి, కాకినాడ జీజీహెచ్

ఒకసారి దాత నుంచి రక్తం తీసుకుంటే 30 రోజుల వరకు నిల్వ ఉంచుకునే వెసులుబాటు ఉంది. ఒకరి నుంచి సేకరిస్తే రక్తం, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా రూపంలో విడదీసి ఆపదలో ఉన్న ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చు.

ఇది ప్రతి ఒక్కరి బాధ్యత

రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. స్వచ్ఛంద రక్తదానాన్ని అన్ని సంస్థల, ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ప్రోత్సహించాలి. జిల్లాలో 20లక్షల మంది ఉండగా కనీసం ఏటా 20వేల మంది రక్తదానం చేయాల్సి ఉంటుంది. ఇచ్చిన వారు మాత్రమే ఇస్తున్నారు. అలాకాకుండా కొత్తగా దాతలు ముందుకు రావాలి. నెగెటివ్ గ్రూప్‌లకు చెందిన వారు అత్యవసర వేళ స్వచ్ఛందంగా స్పందించాల్సి ఉంది.
- రోణంకి రమేష్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి

గంటల తరబడి.. నిలబడి..

వీరంతా కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో స్కానింగ్ కోసం నిరీక్షిస్తున్న మహిళలు. సుమారు 200 మంది గర్భిణులు నిత్యం ఈ సేవలు పొందేందుకు వస్తున్నారు. వీరితో పాటు గర్భాశయ సమస్యలకు సంబంధించిన వారూ ఉంటారు. ఇక్కడ స్కానింగ్ చేసే రేడియాలజిస్టులు ఇద్దరు మాత్రమే ఉండటంతో సేవల్లో జాప్యం జరుగుతోంది. స్కానింగ్ కోసం కొందరు ముందు రోజే ఆసుపత్రికి చేరుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ లావణ్యకుమారి దృష్టికి తీసుకెళ్లగా రేడియాలజిస్టుల కొరత విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. -ఈనాడు, కాకినాడ



నిరీక్షిస్తున్న మహిళలు

నష్ట పరిహారంపై లోకేశ్‌కు వినతి

తాడేపల్లి: ఏలేరు కాలువ ఆధునీకరణ కోసం ఆరేళ్ల క్రితం సేకరించిన తమ 60 సెంట్ల వ్యవసాయ భూమికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పెండ్యాల అమ్మన్న కోరారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో సోమవారం జరిగిన 'ప్రజా దర్బార్'లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

నెయ్యిపై ఏం తేలనుంది?

అన్నవరంలో సరకుల నాణ్యతపై పకడ్బందీగా పరీక్షలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో టెండర్ల ద్వారా కొనుగోలు చేసే సరకుల నాణ్యతపై మరింత పకడ్బందీగా పరిశీలన, పరీక్షలు చేయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి, ఇతర సరకుల నాణ్యతపై రాష్ట్రంలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. అన్నదానం, వేద పాఠశాల, మహానివేదన, వ్రతాలు, ప్రసాదం తదితర వాటికి సరకులను ప్రతి ఆరు నెలలకోసారి జరిగే టెండర్లలో తక్కువ కోట్ చేసిన వారి నుంచి కొనుగోలు చేస్తున్నారు. వీటిని విజయవాడకు చెందిన ఆక్యురేట్ ప్రయోగశాలలో నాణ్యత పరీక్షలు చేయిస్తున్నారు. ద్వారకాతిరుమల, విజయవాడ ఆలయాలు దీనినే ఉపయోగించుకుంటున్నాయి. అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌ను మార్చే యోచనలో ఉన్నారు. కాగా పలు సరకులను జిల్లా ఆహార తనిఖీ అధికారులు పరీక్షలకు పంపారు. నెయ్యి, పంచదార, బెల్లం, పప్పులు, ఇతర సరకుల నమూనాలను సెప్టెంబరు 22న సేకరించారు. నెయ్యిని ప్రత్యేకంగా సెంట్రల్ ల్యాబ్‌కు పంపించారు. మరో పది, పదిహేను రోజుల్లో ఫలితాలు వచ్చే అవకాశముంది.



దేవస్థానానికి వచ్చిన సరకులు

కొనుగోలుపై రాని స్పష్టత

స్వామివారి ప్రసాదం తయారీకి నెయ్యి కొనుగోలుపై ఇంకా స్పష్టత రాలేదు. 2022 అక్టోబరు నుంచి 2024 సెప్టెంబరు వరకు నాలుగుసార్లు టెండర్లు దక్కించుకుని సరఫరా చేస్తున్న రైతు డెయిరీ గడువు సోమవారంతో ముగిసింది. అక్టోబరు 1 నుంచి కొత్త గుత్తేదారు ముందుకు వచ్చినా ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం వారం రోజులకు సరిపడా నెయ్యి దేవస్థానంలో నిల్వ ఉంది. ఈలోగా కొనుగోలుపై మార్గదర్శకాలు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా నెయ్యి కొనుగోలు చేస్తారు. మిగిలిన సరకులను అక్టోబరు 1 నుంచి సరఫరాకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..

నెయ్యి, ఇతర సరకుల కొనుగోలుపై దేవాదాయ శాఖ నుంచి ప్రత్యేక మార్గదర్శకాలు వచ్చే అవకాశముంది. దీనికి అనుగుణంగా సరకుల కొనుగోలుపై పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. నాణ్యత విషయంలో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. -కె.రామచంద్రమోహన్, ఈవో, అన్నవరం

100 రోజుల్లో.. 61 శాతం ప్రగతి

కాకినాడ జిల్లాలో కీలక శాఖల కార్యాచరణ

ఈనాడు, కాకినాడ: గాడితప్పిన పాలనను పట్టాలెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల ప్రణాళికలో కాకినాడ జిల్లా 61 శాతం ప్రగతి సాధించింది. కలెక్టర్ షాన్ మోహన్ నూతన ప్రభుత్వానికి జిల్లా కార్యాచరణ ప్రణాళికను గతంలో సమర్పించారు. 100 రోజులు పూర్తయిన తర్వాత 48 శాఖల పరిధిలో నిర్దేశించుకున్న 147 పనుల్లో 90 పూర్తిచేసినట్లు ప్రభుత్వానికి నివేదించారు.



వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు 83 శాతం, వైద్యారోగ్యశాఖ 79 శాతం, డీపీవో, పశుసంవర్ధక, మత్స్యశాఖల ప్రగతి 75 శాతం చొప్పున.. సర్వే భూ రికార్డులు, సెరికల్చర్, జలవనరులు, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖలు 67 శాతం చొప్పున, డీఆర్‌డీఏ 57 శాతం ప్రగతి సాధించినట్లు చూపారు. పాఠశాల విద్య, మెప్మా, గిరిజన సంక్షేమం, రెవెన్యూ శాఖల ప్రగతి 50 శాతం..విద్యుత్తుశాఖ, బీసీ, సాంఘిక సంక్షేమ శాఖలు 33 శాతం చొప్పున ప్రగతి సాధించాయన్నారు. టిడ్కో, యువజన సంక్షేమం, పౌరసరఫరాలు, ఆర్‌అండ్‌బీ, కాలుష్య నియంత్రణ మండలి, ఉద్యానవన, మార్కెటింగ్, సహకారం, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలు నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రగతి సున్నాగా చూపారు.

లక్ష్య సాధన ఇలా..

● వ్యవసాయ శాఖ ఖరీఫ్‌లో నిర్దేశించుకున్న 89,904 హెక్టార్లలో వరి సాగు, ఈ- పంట నమోదు.. 5,120 భూసార పరీక్షలు.. 18,660 హెక్టార్లలో ప్రకృతి సాగు, 58,941 సీసీఆర్సీ కార్డులకు రూ.58 కోట్ల రుణాల లక్ష్యం శతశాతం పూర్తిచేసినట్లు చూపింది. ● ఉచిత ఇసుక విధానం అమల్లోకి తేవడం, అక్రమ తవ్వకాలు అడ్డుకోవడంలో శతశాతం ప్రగతి సాధించినట్లు భూగర్భ గనులశాఖ పేర్కొంది. ● జిల్లాలోని 46 పీజో మీటర్ల ద్వారా భూగర్భ జలమట్టాల పర్యవేక్షణ సమర్థంగా సాగుతున్నట్లు ఆ శాఖ పేర్కొంది. ● ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ, బాల్య వివాహాలు అరికట్టడం తదితర కార్యక్రమాల్లో శత శాతం ప్రగతి సాధించినట్లు చూపారు. ● అగ్నిమాపక, విపత్తుల నిర్వహణశాఖ ఆధ్వర్యంలో ఫైర్ డ్రిల్స్, ప్రమాదకర ప్రాంగణాల తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు శతశాతం పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ● పురపరిపాలన శాఖలో 114 కి.మీ పొడవున మేజర్, 335 కి.మీల మీడియం, 1,451 కి.మీ మైనర్ కాలువల్లో పూడిక తీత ప్రక్రియ పూర్తిచేశామని 219 వ్యర్థాల కేంద్రాలను శుభ్రపరిచామని పేర్కొంది.

✔ 12 జాబ్ మేళాలు నిర్వహించాలన్న లక్ష్యాన్ని పూర్తిచేశామని ఉపాధి-శిక్షణ శాఖ వెల్లడించింది.
✔ పరిశ్రమల శాఖలో పీఎంఈజీపీ కింద 50 యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా 76 ఏర్పాటు చేశామంది.

త్వరితగతిన అర్జీలకు పరిష్కారం

పిఠాపురం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. పిఠాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ హాజరై అర్జీలు స్వీకరించారు. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకూ 206 అర్జీలు స్వీకరించారు. టిడ్కో గృహాలు అప్పగించాలని, మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని, రెవెన్యూ, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఎస్ఈజెడ్ భూముల నమోదు, వైద్య ఆరోగ్య సేవలు, ఉపాధి కల్పించాలని, పారిశుద్ధ్యం మెరుగు, సదరం ధ్రువపత్రాలు కావాలని తదితర సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. ఆర్డీవో ఇట్ల కిషోర్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి జేడీ శ్రీనివాసరావు, డీఎల్‌డీవో నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

సెజ్ భూములు ఆన్‌లైన్ చేయడం లేదు



సెజ్ ప్రాంతంలో నష్ట పరిహారం తీసుకోని 2,180 ఎకరాలు తిరిగి ఆ రైతులకు ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు చాలామంది రైతులకు ఆయా భూములు ఆన్‌లైన్ కానీ, రిజిస్ట్రేషన్ కానీ చేయలేదు. పంట వేసుకునేందుకు, రుణాలు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - చింతా సూర్యనారాయణ, రైతు, మూలపేట

తప్పుడు సర్వేలు చేసిన వారిపై చర్యలు



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో చాలా మంది రెవెన్యూ అధికారులు సర్వే చేసేటప్పుడు తప్పులు చేశారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలి. అదే అధికారులు ఇప్పుడూ కొనసాగుతున్నారు. వారుంటే రైతులకు న్యాయం జరగదు. - కొమ్మూరి గంగాధర్, దుర్గాడ

పరిహారం ఇవ్వలేదు



నాకు రాపర్తి వద్ద గొర్రిఖండి అనుకుని 40 సెంట్ల భూమి ఉంది. దాదాపు ఏడేళ్ల క్రితం ఏలేరు ఆధునికీకరణ కోసం 30 సెంట్లు తీసుకుని పరిహారం ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. - సుంకర లక్ష్మణరావు, రాపర్తి

తీరని వేదన.. సమస్యల నివేదన

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌కు అర్జీదారులు పోటెత్తారు. ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా.. పరిష్కారం కావడం లేదని కొందరు.. డివిజన్, మండల స్థాయిలో విన్నవించినా బుట్టదాఖలు అవుతున్నాయని మరికొందరు.. ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాస్థాయి వినతుల స్వీకరణకు కలెక్టర్ లేకపోవడం, ఆయన మండలస్థాయిలో పిఠాపురంలో అర్జీల తీసుకోవడానికి వెళ్లడంతో చాలా మంది నిరాశకు గురయ్యారు. ఉదయం 9 గంటలకే 385 మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి జేసీ రాహుల్‌మీనా, శిక్షణ కలెక్టర్ హెచ్ఎస్ భావన, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఉప కలెక్టర్లు ఎన్‌వీవీ సత్యనారాయణ, లావణ్య వినతులు స్వీకరణ ప్రారంభించారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. వినతులు ఇచ్చినా.. రశీదులు త్వరగా రాకపోవడంతో సాయంత్రం 4 గంటల వరకు నిరీక్షించారు.



కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణలో సమస్య తెలుసుకుంటున్న జేసీ రాహుల్‌మీనా

పంచాయతీ స్థలాన్ని కాపాడాలి..: తాళ్లరేవు మండలం చినగోవలంక పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 52/4లో 16 సెంట్ల భూమిని కొందరు కబ్జా చేశారని, దానిని కాపాడాలని ఆ గ్రామ సర్పంచి కోరుకొండ సింహాద్రమ్మ జేసీ రాహుల్‌మీనాకు ఫిర్యాదు చేశారు.

రైతేరాజు — అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

2,75,679 మంది.. రూ.116.03 కోట్లు

నేడు పింఛన్ల పంపిణీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 2,75,679 మంది లబ్ధిదారులకు అక్టోబరు నెలకు ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ము రూ. 116.03 కోట్లు విడుదల చేశారు. జిల్లాలోని 620 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో కార్యదర్శులు సోమవారం ఆ సొమ్మును బ్యాంకుల నుంచి ఉపసంహరించి సిబ్బందికి అప్పగించారు. 4,857 మంది సచివాలయ, ఇతర శాఖల ఉద్యోగులు పింఛను సొమ్మును మంగళవారం లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పంపిణీ చేయనున్నారు. ఒక్కరోజులోనే పంపిణీ ప్రక్రియ నూరుశాతం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. సోమవారం ఎవరైనా లబ్ధిదారులు సొమ్ము తీసుకోకపోతే.. అక్టోబరు 2న గాంధీ జయంతి సెలవు కావడంతో 3న అందజేయాలని సూచించారు. సోమవారం కలెక్టర్ షాన్ మోహన్ కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము అందజేయాలని ఆదేశించారు. పంపిణీలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. వీటి పంపిణీని ప్రతి గంటకు సమీక్షిస్తామని చెప్పారు.

అక్టోబరు నెలలో మంజూరైనవి

నియోజకవర్గం	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
తుని	38,023	16.16
ప్రత్తిపాడు	37,870	16.02
జగ్గంపేట	31,854	13.61
పెద్దాపురం	35,918	15.06
పిఠాపురం	40,186	17.70
కాకినాడ గ్రామీణం	29,667	12.42
కాకినాడ నగరం	30,106	12.75
మండలాలు..		
కాజులూరు	10,054	4.16
తాళ్లరేవు	11,506	4.81
పెదపూడి	10,495	4.28

కలెక్టర్ పేరు చెప్పి.. సొమ్ము కాజేసేయత్నం

తహసీల్దార్లకు సైబర్ నేరస్థుడి వాట్సాప్ సందేశం

ఈనాడు, కాకినాడ: 'హలో.. ఎలా ఉన్నారు...? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు..? నేను చాలా కీలకమైన సమావేశంలో ఉన్నాను. మాట్లాడలేని పరిస్థితి.. నేను చెప్పిన ఖాతాకు రూ.50 వేలు పంపించండి.. సమావేశం ముగిశాక.. ఈరోజు మీకు ఆ మొత్తాన్ని తిరిగి పంపించేస్తాను' ఇదీ కాకినాడ జిల్లాలోని పలువురు తహసీల్దార్ల చరవాణిలకు సోమవారం వచ్చిన వాట్సాప్ సందేశం. డీపీలో చిత్రం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ది ఉండటం. ఫోన్ నంబర్ వేరేగా ఉండడంతో అనుమానం నెలకొంది. ఆరా తీస్తే అది ఫేక్ సందేశమని, సైబర్ నేరస్థుడి వలగా తేలిపోయింది. ఇలాంటి తప్పుడు సందేశాలకు ఎవరూ స్పందించవద్దని, డబ్బులు పంపించొద్దని జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సి వచ్చింది. ఈ వాట్సాప్ ఫేక్ మెసేజ్ +998881942520 నంబరుతో శంఖవరం, తొండంగి తదితర మండలాల తహసీల్దార్లకు వెళ్లడంతో విషయాన్ని ఎస్పీతోపాటు, సైబర్ విభాగం దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. ఈ ఏడాది ఆగస్టు 20న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చిత్రంతో వాట్సాప్ కాల్ ఏకంగా జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఆ నంబరు శ్రీలంకకు చెందినదిగా గుర్తించారు.



కలెక్టర్ చిత్రం, పేరుతో తహసీల్దార్లకు వెళ్లిన వాట్సాప్ సందేశం

పోటెత్తారు.. చేతులెత్తేశారు!

అసౌకర్యాల మధ్య ఎంపికలు



డీఎస్ఏలో భోజనం కోసం బారులుదీరిన క్రీడాకారులు



బోరు నీటిని సీసాలో నింపుతున్న క్రీడాకారులు

న్యూస్‌టుడే, మసీదుసెంటర్(కాకినాడ)

ఎండకు తాళలేక కొందరు.. దాహం తీర్చుకునేందుకు నీళ్ల దొరకక మరికొందరు.. భోజనాలకు బారులుదీరి నిరీక్షించలేక ఇంకొందరు.. ఇదీ క్రీడాకారుల పరిస్థితి. కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో సెప్టెంబరు 25 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పాఠశాల సమాఖ్య ఫెడరేషన్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఇటీవల వర్షాల కారణంగా ఎంపికలు వాయిదా పడ్డాయి. సోమవారం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, కరాటే తదితర క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఒకేసారి సుమారు 4వేల మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. నిర్వాహకులు ఏర్పాట్లలో విఫలమయ్యారు. కూర్చునేందుకు మైదానంలో ఒక్క టెంటైనా ఏర్పాటు చేయలేదు. ఎండలో కూర్చోవలసి వచ్చింది. మంచినీటి సదుపాయం సరిగా చేయకపోవడంతో కొందరు బోరు నీరు తాగారు. మరుగుదొడ్లకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయలేదు. భోజనాల వద్ద గంటల తరబడి బారులుదీరారు. కొంతమంది క్రీడాకారులు ఇంటి నుంచి క్యారేజీలు, మంచినీటి బాటిల్స్ తెచ్చుకున్నారు.

కందిపప్పు వచ్చేస్తోంది..!

జిల్లాకు 250 టన్నుల కేటాయింపు



కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదలకు రాయితీ కందిపప్పు పంపిణీకి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైకాపా ప్రభుత్వంలో దీనిని ఇవ్వకుండా భారం మోపారు. అక్టోబరు నెలకు కాకినాడ జిల్లాకు కందిపప్పు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాకు 250 టన్నులు కేటాయించారు. ఇప్పటికి 15 టన్నులు పౌరసరఫరాల సంస్థ గోదాములకు చేరింది. మరో 30 టన్నులు లారీల ద్వారా ఇక్కడికి తరలిస్తున్నారు. ఈ నెల 2, 3 తేదీల నాటికి మొత్తం సరకు జిల్లాకు చేరనుంది. ఇందులో 30 టన్నుల వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు, మిగిలినది రేషన్‌కార్డు దారులకు అందజేయనున్నారు. జిల్లాలో 6.54 లక్షల కార్డులు ఉండగా, కార్డుకు కేజీ చొప్పున రూ.67 ధరకు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 35 శాతం కార్డులకు కంది పప్పు పంపిణీ చేసే అవకాశం ఉంది. నవంబరు నుంచి అందరికీ బట్వాడా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మంగళవారం నుంచి బియ్యం, పంచదార, రాగులు, కందిపప్పును 420 ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్ద పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. వీలైనంత త్వరగా కందిపప్పును దిగుమతి చేసుకుని, కార్డుదారులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 17 వరకు సరకుల పంపిణీ జరుగుతుందని, అవసరమైతే గడువు పెంచుతారని చెప్పారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జోన్ 1 పరిధిలోని శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఉమ్మడి ఆరు జిల్లాల పరిధిలో అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ బాలాత్రిపుర సుందరి ఆలయంలో జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆలయంలో క్యూలైన్లు, మంచినీరు, ఉచిత ప్రసాదం వంటి వాటిని ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. ఉత్సవాల సమయంలో రోజూ ఆలయానికి 30వేల నుంచి 40వేల వరకు, మూల నక్షత్రం, దుర్గాష్టమి, మహార్నవమి సమయాల్లో సుమారు లక్ష మంది, దశమికి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. ఆలయంలో రోజూ ఆధ్యాత్మిక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదిక వద్ద వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి, కమిషనర్ల సూచనల మేరకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలుత ఆర్జేసీ సుబ్బారావు దంపతులకు ఈవో సాదర స్వాగతం పలకగా, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆర్జేసీకి ఆలయ చరిత్రను వివరించారు. ఈవో అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.



బాలాత్రిపుర సుందరి ఆలయంలో క్యూలైన్లు పరిశీలించి సూచనలు చేస్తున్న ఆర్జేసీ సుబ్బారావు

పట్టభద్రులకు ఓట్ల పండగ

నమోదుకు నవంబరు 6 వరకు అవకాశం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటు నమోదుకు సోమవారం ప్రకటన జారీ చేశారు. ఇదే రోజు నుంచి అర్హులైన పట్టభద్రులు నవంబరు 6 వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ నియోజకవర్గం పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అర్హుల నుంచి ఫారం-18 ద్వారా ఓటుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అదే రోజు నుంచి డిసెంబరు 9 వరకు మళ్లీ అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. వీటిపై డిసెంబరు 25 నాటికి వివరాలు పూర్తి చేసి, ఆ నెల 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. దీని ఆధారంగా ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు.



ఈఆర్వో కార్యాలయంలోని ఎన్నికల విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇవీ అర్హతలు

● ఉభయగోదావరి జిల్లాల్లో నివాసిగా ఉండాలి

● ఈ ఏడాది నవంబరు 1 నాటికి మూడేళ్ల ముందు డిగ్రీ ఉత్తీర్ణులు

మార్చి 29 వరకు పదవీ కాలం: ప్రస్తుత ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) పదవీ కాలం 2025, మార్చి 29తో ముగియనుంది. 2019, మార్చి 22న జరిగిన ఎన్నికల్లో ఆయన నల్లమిల్లి శేషారెడ్డిపై మొదటి ప్రాధాన్య ఓటుతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో 46 మంది పోటీ చేశారు.

2019 ఎన్నికల్లో ఓటర్లు

మొత్తం ఓటర్లు	2,93,794
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు	1,72,415
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఓటర్లు	1,21,379
పోలింగ్ కేంద్రాలు	293
ఉమ్మడి తూర్పుగోదావరి	166
ఉమ్మడి పశ్చిమగోదావరి	133

దరఖాస్తు ఇలా

● కార్యాలయాల్లో ఫారం-18 దరఖాస్తు పొందాలి ● గజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేసిన డిగ్రీ ధ్రువపత్రం నకలు జత చేయాలి ● రెండు పాస్‌పోర్టుసైజ్ ఫోటోలు అతికించాలి ● ఆధార్ కార్డు నకలు, చిరునామా ధ్రువీకరణ పత్రం జత చేయవచ్చు ● కాకినాడ కలెక్టరేట్‌లోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) కార్యాలయంతో పాటు సబ్‌కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ● ceoandhra.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేయవచ్చు

అర్హులంతా నమోదు చేసుకోవాలి

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి. గత ఎన్నికల్లో ఉన్న ఓటర్ల జాబితా ఇప్పుడు పనిచేయదు. ఈ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే గుర్తింపు పొందిన కార్యాలయాలకు 3 లక్షల ఫారం-18 దరఖాస్తులు పంపించాం. వీటిని ఆయా కార్యాలయాల్లో తీసుకుని అక్కడే అందజేయాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు. ఏక మొత్తంగా ఇచ్చే దరఖాస్తులను స్వీకరించం. ఏదైనా కార్యాలయంలో పనిచేసే అర్హులైన ఓటర్ల అక్కడి అధికారి ధ్రువీకరణతో బల్క్‌గా దరఖాస్తులు ఇచ్చినా అనుమతిస్తాం.

- డి.తిప్పేనాయక్, ఈఆర్వో, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి

ఒండ్రుమట్టితో భూసారం పెరుగుదల

రైతేరాజు | **మీ కోసం**

పి.గన్నవరం: గోదావరి వరదలు లంకగ్రామాల ప్రజలను, రైతులను ఇబ్బందికి గురిచేస్తుంటాయి. అదే వరదనీటితో కొండల నుంచి కొట్టుకొచ్చిన మట్టి డెల్టాభూముల్లో ఒండ్రుమట్టిగా పోయడంతో భూసారం బాగా పెరుగుతుంది. దీంట్లో సహజసిద్ధమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రకృతి వ్యవసాయ సాగు ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్ వివరించారు. ఈ ఒండ్రుమట్టి భూసారాన్ని బాగా పెంచుతుందన్నారు. ప్రధానంగా నాలుగు రకాల పోషకాలు ఉంటాయి.

1) స్థూల పోషకాలు: నత్రజని, భాస్వరం, పొటాష్ కలిసి ఉంటాయి.

2) ద్వితీయ పోషకాలు: కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్ మిళితమై ఉంటాయి

3)సూక్ష్మ పోషకాలు: జింక్, ఇనుము, మాంగనీస్, రాగి ఉంటాయి.

4)అతిసూక్ష్మ పోషకాలు: బోరాన్, మాలిబ్డినియం, నికెల్, కోబాల్ట్, సోడియం సమపాలల్లో ఉంటాయి.

రైతులు ఇలా చేయాలి

వరదనీరు పూర్తిగా తొలగిన తరువాత కొబ్బరితోటల్లో పైపాటుగా దుక్కిదున్ని నవధాన్యాలు మిశ్రమంగా లేదా లైన్‌షోయింగ్(పిడిగా) చల్లాలి. వీటితో భూసారం మరింత పెరుగుతుంది. ఇలా చేస్తే ఏడాదిపాటు ఎలాంటి ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదని ఎలియాజర్ సూచించారు.



కొబ్బరితోటల్లో వరదనీరు... దీంట్లోనే సారవంతమైన ఒండ్రుమట్టి కలిసి ఉంటుంది

వరిలో ఎండాకు తెగులును అరికడదాం

తెలుసుకుందాం..

చాగల్లు, అనపర్తి గ్రామీణం న్యూస్‌టుడే

అధిక వర్షాల కారణంగా వరి పంటపై ఎండాకు తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, అనపర్తి ఏవో సురేష్‌కుమార్ తెలిపారు.

● **తెగులు నిర్ధారణ ఇలా:** ఎండిన ఆకులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. తెగులు సోకిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవించడం వల్ల కొన్ని గంటల తరువాత నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారడం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటకు ఎండాకు తెగులు ఆశించినట్లు గుర్తించవచ్చు.

● **నివారణ చర్యలు:** బాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు 5శాతం కంటే ఎక్కువగా ఉంటే, పై పాటుగా వేయాల్సిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేసి, ఎండలు కాసిన తరువాత మాత్రమే వేసుకోవాలి. సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరెట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా వేయాలి. తెగులు వ్యాప్తిని కొంత వరకు అరికట్టడానికి లీటరు నీటికి 0.5-1 గ్రాముల స్ట్రెప్టోమైసిన్ ,టెట్రాసైక్లిన్ హైడ్రో క్లోరైడ్, కాపర్ హైడ్రాక్సాయిడ్ 2 గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తిస్తే, దాని నివారణకు ఒక లీటరు నీటిలో ఎసిఫేట్ 1.5గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3మి.లీ పిచికారీ చేయాలి.

పెట్టుబడి తగ్గించి.. ఆదాయం పెంచి

స్ఫూర్తి

ఉప్పలగుప్తం: వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులను తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అన్నదాతలు కృషి చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర, వంటి పైర్లను సాగు చేస్తున్నారు. ఉప్పలగుప్తం మండలం విలసవిల్లికి చెందిన రైతు జి.రామకృష్ణ రసాయన రహిత సాగు చేస్తున్నారు. తనకున్న ఎకరం పొలంలో వరితో పాటు, పొలం గట్లపై వంకాయ, ఆనప, చిక్కుడు, ఆకు కూరలను పండిస్తున్నారు.

ఆరోగ్యకరమైన సాగు..

అయిదేళ్లుగా సేంద్రియ సాగు చేస్తున్నా. పచ్చిరొట్ట పైరును వేసి పూతదశలో చేలో కలియ దున్నడంతో భూసారం పెరుగుతుంది. ఆవులు, గేదెలను కొనుగోలు చేశాం. వాటి పేడ, మూత్రాలతో ద్రవ రూప జీవ ఎరువులు, జీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం, పంచగవ్య, ఉల్లికషాయం వంటి వాటిని వివిధ దశల్లో వాడి వరిసాగు చేపట్టారు. వరిలో అజొల్లాను చల్లడం ద్వారా కలుపు తగ్గింది. లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టల ద్వారా వరి చేనుకు హానికలిగించే కీటకాలను, దోమలను చాలా వరకూ నివారించ గలిగారు.

తోటి రైతులకు వివరిస్తున్నా...

ధాన్యాన్ని దగ్గరలోని మిల్లుద్వారా దంపుడు బియ్యంగా ఆడించి చుట్టుపక్కల గ్రామాల వారికి విక్రయిస్తున్నా. ఎకరాకు సుమారు రూ.15వేల పెట్టుబడితో రూ.50 వేల వరకూ లాభం వస్తుంది. పొలం గట్లమీద పండించిన కూరగాయలు, ఆకు కూరలను ఇంటి అవసరాలకు పోను గ్రామంలో వారికి అమ్ముతున్నా. తక్కువ పెట్టుబడితో ఏటా దిగుబడి పెరుగుతూ వస్తుంది. సమీప రైతులు సాగు గురించి వివరాలు ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని వారికి వివరిస్తున్నా.

- జి.రామకృష్ణ, వరిరైతు, విలసవిల్లి



రైతులతో కలసి నీమాస్త్రం తయారు చేస్తున్న రైతు రామకృష్ణ

ప్రశ్న సమాధానం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే



ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం పట్టినందున లంక గ్రామాల పశుపోషకులు పశువుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు **పుట్టా వీరవెంకట సుబ్బారావు** సూచించారు. పశుపోషకులు అడిగిన ప్రశ్నలకు పలు సూచనలిచ్చారు.

? ప్రశ్న: జీవాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులకు ఏం చర్యలు తీసుకోవాలి ?

- ఎం.సోమన్న, కట్టుంగ

✔ సమాధానం: జీవాలకు చీడపారుడు, నీలి నాలుక, చిటుకు వంటి వ్యాధులు సోకవచ్చు. నీలి నాలుక వ్యాధి సోకిన జీవాల నాలుక నీలిరంగులోకి మారి వాపు వచ్చి జ్వరం వస్తుంది. ఏడాదికొకసారి బ్లూటంగ్ టీకా వేయిస్తే ఈ వ్యాధి సోకదు. చీడపారుడుకు నాలుక, చిగుళ్ల మీద పుండ్లు ఏర్పడి విరేచనాలు అవుతాయి. నీరసంగా ఉండి చనిపోయే ప్రమాదం ఉంది. రోగం గమనించి యాంటిపైరెటిక్ ఇంజక్షన్లు ఇప్పించాలి.

? దూడల్లో తెల్లవిరేచనాలవుతున్నాయి. నివారణ ఎలా?

- సత్యనారాయణరాజు, ఆత్రేయపురం

✔ సమాధానం: దూడ పుట్టిన 12-18 గంటల తర్వాత తెల్ల విరేచనాలు అవుతుంటాయి. నివారణకు యాంటీ బయెటిక్ ఫౌడర్ అందించాలి. సెలైన్ లివర్ మందులు వాడాలి. జావ తాగించాలి. 10 కిలోల బరువున్న దూడకు ఒక లీటరు చొప్పున పాలు పట్టించాలి.

ఆసక్తికర బోధనతో సైన్స్‌పై మక్కువ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఆసక్తికర బోధనతో సైన్స్ పట్ల విద్యార్థులకు మక్కువ కల్పించాలని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి (వీసీ) కేవీఎస్‌జీ మురళీకృష్ణ కోరారు. ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ, జేఎన్‌టీయూకే సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జేఎన్‌టీయూ అలుమ్ని ఆడిటోరియంలో సోమవారం 'సైన్స్ బోధనలో నూతన పోకడలు, అవకాశాలు' అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఇష్టాయిష్టాలను తెలుసుకుంటే ఏ సబ్జెక్టు కష్టం కాదన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణలు సైన్స్ ఉపాధ్యాయులకు తమ బోధనలో ఉపకరిస్తాయన్నారు. జేఎన్‌టీయూకే డైరెక్టర్ డా.ఎం.రమేష్, ప్రొ.అలపాటి శ్రీనివాస్, ఎంఈవోలు సీహెచ్ రవి, డి.డేవిడ్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, మాట్లాడారు. రాజారావు, ఎం.శ్రీనివాస్, కృష్ణారావు, గోవిందరాజు, వాకాడ వెంకటరమణ, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

విజయాల కూత..

కాకినాడ డీఎస్ఏ మైదానంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14, 17 బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. కబడ్డీలో ఓ క్రీడాకారుడు అద్భుత ప్రతిభ చూపాడు. ఆరుగురు నిలువరించినా కబడ్డీ కూత ఆపకుండా గీతను తాకి వారిని వెనక్కి పంపించాడు.

- న్యూస్‌టుడే, మసీదుసెంటర్ (కాకినాడ)



జిల్లాలో ఈ-క్రాప్ 99 శాతం పూర్తి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు 99 శాతం, ఈకేవైసీ 93 శాతం పూర్తయిందని వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ-క్రాప్ నమోదు సెప్టెంబరు 23తో పూర్తయిందన్నారు. ప్రస్తుతం ముసాయిదా జాబితాలపై జిల్లా స్థాయిలో ఆర్డీవోలు, ఏవోలు, ఇతర అధికారులు సూపర్ చెక్ నిర్వహిస్తున్నారన్నారు. తుది జాబితాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వర్షాలు, వరదల కారణంగా ఈ-క్రాప్, ఈకేవైసీల నమోదులో కాస్త జాప్యం జరిగిందన్నారు. సెప్టెంబరు 15తో పూర్తయిన గడువును పొడిగించాల్సి వచ్చిందన్నారు. జిల్లాలో 1.24 లక్షల హెక్టార్ల విస్తీర్ణానికి 90వేల హెక్టార్లలో వరి సాగు చేశారన్నారు.

అరటి మార్కెట్ వెలవెల

అంబాజీపేట, న్యూస్‌టుడే: అరటికి పెద్దగా డిమాండ్ లేకపోవటంతో అంబాజీపేట అరటి మార్కెట్ వెలవెలబోయింది. గత నెల వరకు ఆశాజనకంగానే ఉన్న అరటి ధరలు ఇప్పుడు బాగా తగిపోయాయి. మొన్న గోదావరికి వచ్చిన వరదలు... అధిక వర్షాలకు అరటిపంట కొంత మేర నష్టపోవటంతో నాణ్యమైన అరటిగెలలు మార్కెట్‌కు రాని పరిస్థితి. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన గెలలకు చాలా తక్కువ ధర వస్తుందని వాపోతున్నారు. నెల రోజుల క్రితం ఉన్న ధర ఇప్పుడు రావడంలేదంటున్నారు. ప్రస్తుతం కోనసీమలోని అంబాజీపేట అరటిమార్కెట్‌లో ధరలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాలకు ఎగుమతులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. అరటి ధరలు పెరుగుదలకు పండుగలు దోహదం చేస్తాయి. దీంతో రానున్న దసరా, దీపావళి, కార్తిక మాసం పర్వదినాలపైనే కర్షకులు ఆశలు పెట్టుకున్నారు.



అంబాజీపేట మార్కెట్

ఇదీ ధరల తీరు (గెల ఒక్కింటికి)

రకం	నెల రోజుల క్రితం	ప్రస్తుతం
కర్పూర	220-350	110-270
చక్రకేళి	140-300	140-280
అమృతపాణి	120-270	120-250
పచ్చఅరటి	100-220	100-200



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు



దీక్ష చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వివిధ సంఘాలు చేపట్టిన ధర్నాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. సోమవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద నిరసనలు హోరెత్తాయి. అనంతరం జేసీ రాహుల్‌మీనాకు వినతి పత్రాలు అందజేశారు. సీఐటీయూ జాతీయ స్థాయి పిలుపులో భాగంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, నాన్ పర్మినెంట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2013లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ ప్రతినిధులు దువ్వ శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, వివిధ సంఘాల ప్రతినిధులు నాయకత్వం వహించారు.

● వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, మాలమహానాడు కాకినాడ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ దీక్ష నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును తెదేపా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాకినాడలో దళిత వైద్యుడిపై దాడి చేసి, అవమానపరిచిన కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీని జనసేన నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పండు అశోక్‌కుమార్, సిద్ధాంతుల కొండబాబు , తోటి చెంగలరావు, తదితరులు నాయకత్వం వహించారు.

● నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని, రూ.10వేల వేతనంలో కొనసాగించే హామీని అమలు చేయాలని కోరుతూ గ్రామ, వార్డు వాలంటీర్లు ఆందోళన నిర్వహించారు. ఏపీ గ్రామ/వార్డు వాలంటీర్ల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బలవంతంగా రాజీనామాలు చేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమానికి సీఐటీయూ ప్రతినిధులు మలకా వెంకటరమణ, ఎంవీ రమణ, యూనియన్ ప్రతినిధులు సంతోషిణి, ఎన్.నాగలక్ష్మి నాయకత్వం వహించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	12,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

ఉల్లిపాయల లోడు లారీల బోల్తా

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రెండు ఉల్లిపాయల లోడు లారీలు సోమవారం తెల్లవారుజామున మండలంలోని ఎర్రకోనేరు జాతీయ రహదారిపై బోల్తాపడ్డాయి. వెనుక లారీ డ్రైవరు నిద్ర మత్తు కారణంగా ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ముందున్న లారీ జాతీయ రహదారి పక్కన ఎడమవైపు పడిపోగా, వెనుక లారీ కుడివైపు డివైడరు ఎక్కి బోల్తా పడింది. ఆ సమయంలో ఇతర వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఇతర ప్రమాదాలు చోటుచేసుకోలేదు. ఉల్లిపాయల లారీల్లో ఉన్న ఇద్దరు క్లీనర్లకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఉల్లిపాయల బస్తాలు కింద పడటంతో వాటిని తీసుకువెళ్లేందుకు జనం ఎగబడ్డారు. సమాచారం తెలుసుకున్న హైవే అథారిటీ మొబైల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ ఘటనపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఎర్రకోనేరు సమీపంలో జాతీయ రహదారి పక్కన బోల్తాపడిన లారీలు

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 78.54 లక్షలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.78.54 లక్షలు సమకూరింది. ఛైర్మన్ రోహిత్, ఈవో కె.రామచంద్రమోహన్ సమక్షంలో సోమవారం హుండీలను తెరచి లెక్కించారు. గత 28 రోజులకు రూ. 78,54,428 ఆదాయం వచ్చింది. ఇందులో నగదు రూ. 75,38,066, చిల్లర రూ.3,16,362 ఉంది. 31 గ్రాముల బంగారం, 453 గ్రాముల వెండి ఆభరణాలు కానుకల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేబిస్‌తో వృద్ధుడి మృతి

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: తుని మండలం డి.పోలవరానికి చెందిన వి.అప్పారావు(73) రేబిస్‌కు గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందారు. కుక్కకాటుకు గురైన ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గతనెల 29న జీజీహెచ్‌లో చేర్చారు.

బెంగళూరు బాలిక నేడు బంధువులకు అప్పగింత

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి 14 ఏళ్ల బాలిక శేషాద్రి రైలు ఎక్కి ఒంటరిగా ఆదివారం కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ఆ బాలికను ఆర్పీఎఫ్ అధికారులు సఖి వన్ స్టాప్, ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులకు అప్పగించారు. ఆమె నుంచి సోమవారం మరిన్ని వివరాలు సేకరించారు. మొదట్లో ఆ బాలిక చెప్పినట్లు ఆమె తల్లి రైలు ఎక్కించలేదని తేలింది. తనే స్వయంగా బెంగళూరులో రైలు ఎక్కి కాకినాడకు వచ్చినట్లు ఆమె చెప్పింది. బెంగళూరు నుంచి ఆ బాలిక పెదనాన్నతోపాటు కానిస్టేబుల్ కాకినాడ వస్తున్నట్లు ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయానికి కాకినాడకు చేరుకుంటారని, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ పర్యవేక్షణలో బాలికను వారికి అప్పగిస్తామని చెప్పారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు (కిలోకు)



గాంధీనగర్: టమాటా - 34, వంకాయలు - 40, 44, 68, బెండకాయలు - 30, పచ్చిమిర్చి - 28, 34, కాకరకాయలు- 40, బీర - 48, కలీఫ్లవర్ - 20, 25, క్యాబేజీ - 33, క్యారెట్ -36, 40, దొండకాయలు - 30, 44, బంగాళాదుంపలు - 30, 36, ఉల్లి - 52, 56, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 34, ఆనపకాయ - 25, 30, పొట్లకాయ - 18, 20, అరటికాయ - 5, 7, చిక్కుళ్లు - 56, 100, చేమదుంపలు - 40, 48, మునగకాడలు - 12, 15, బీట్‌రూట్ - 32, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 70, అల్లం - 50, క్యాప్సికం - 60, బొబ్బర్లు - 54, చిలకడదుంపలు - 50, నిమ్మకాయలు(డజన్) - 24, 60.

సినిమాలు గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, 35, దేవీ మల్టీప్లెక్స్ 4(స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, 35, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- దేవర పార్ట్ 1, తిరుమల - దేవర పార్ట్ 1, సీఎండ్ 1- మత్తువదలరా 2, సీఎండ్ 2- దేవర పార్ట్ 1, శ్రీప్రియ - ఆయ్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1 (వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- దేవర పార్ట్ 1, శ్రీనివాసా(వేళంగి)- దేవర పార్ట్ 1.

భీమేశ్వరస్వామికి పూజలు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన సామర్లకోట చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అలంకరణ చేశారు.

కలెక్టర్‌ను కలిసి డీటీసీ



కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా ఉప రవాణా కమిషనర్ కె.శ్రీధర్ సోమవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి డీటీసీగా పనిచేస్తున్న ఆదిమూలం మోహన్‌ను బదిలీ చేయగా, ఆయన స్థానంలో శ్రీధర్‌ను నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో రవాణాశాఖకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన జడ్పీ సీఈవో లక్ష్మణరావు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్తు ముఖ్య కార్యనిర్వాహణాధికారి లక్ష్మణరావు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్పీకి కొత్త సీఈవోగా బాధ్యతలు చేపట్టిన రోజున కలెక్టర్ సెలవులో ఉండటంతో ఇప్పుడు ఆయనను కలిసి వివిధ అంశాలను చర్చించారు.

నార్త్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐగా రామ్మోహన్‌రావు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నార్త్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐగా కె.రామ్మోహన్‌రావు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన గుడివాడ సెబ్ స్టేషన్ సీఐగా పనిచేసి బదిలీపై కాకినాడ వచ్చారు. గతంలో కాకినాడ సెబ్ నార్త్ స్టేషన్ సీఐగా పని చేశారు. నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్సైగా బీఎస్ఎన్ వరహాలు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా పనిచేస్తున్న పెద్దిరాజు బదిలీపై విజయవాడ ఈస్ట్ ఎక్సైజ్ స్టేషన్ సీఐగా వెళ్లారు.

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు అమలు చేయండి

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరంలో పర్యావరణానికి హాని చేస్తున్న కోనో కార్పస్ మొక్కలను తొలగించాలని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు జేసీ రాహుల్‌మీనాకు ఫిర్యాదు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించి, వీటిని తొలగించాలని ఆదేశించినా అమలు కావడం లేదన్నారు. వీటి స్థానంలో వేప మొక్కలు వేయాలని విజ్ఞప్తి చేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు



పతకాలు అందుకుంటున్న శ్రీనివాసరావు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఎస్‌బీకేఎఫ్ 10వ అంతర్జాతీయ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు మూడు బంగారు పతకాలు సాధించారు. పవర్ లిఫ్టింగ్ విభాగంలో(520 కేజీలు), హేమర్ త్రో, షార్ట్ పుట్ విభాగాల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పతకాల సాధనకు కొన్ని నెలలుగా కఠోర సాధన చేశారన్నారు. ఈ పోటీలు సింగపూర్, మలేషియా దేశాల్లో సెప్టెంబరు 22 నుంచి 30 వరకు నిర్వహించారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల అందజేత

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ అభయం ఫౌండేషన్(పైడా చారిటీ ఆర్గనైజేషన్)లో స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ ట్రైనింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి సంస్థ ఛైర్మన్ పైడా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ఏఎస్‌డీ కళాశాల బోటనీ అధ్యాపకురాలు సౌజన్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంఎస్ ఆఫీస్, టాలీ, సి లాంగ్వేజీలో శిక్షణ ఇచ్చినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

మసీదుసెంటర్ (కాకినాడ): ద్విచక్రవాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు అన్నారు. సోమవారం కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు, ట్రాఫిక్-1, 2 సీఐల ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ఛార్టీస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఈవీఎం గోదాముకు భద్రత

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈవీఎంలు, వీవీ పాట్స్ భద్రపర్చిన గోదాముకు పటిష్ఠ రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షాన్‌మోహన్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమీపంలోని గోదాములను వివిధ శాఖల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతినెలా ఈ గోదామును తనిఖీ చేసి నివేదిక పంపిస్తున్నామన్నారు. తహసీల్దారు వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహసీల్దారు ఎం.జగన్నాథం, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహార ప్రదర్శన ఏర్పాటు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పోషకాహార ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి ప్రారంభించి పోషక విలువలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.సువర్చల, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.వసంతలక్ష్మి, అధ్యాపకులు డా.కె.లావణ్య, ఎల్.మల్లేశ్వరి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ పెట్రోల్ తాగిన బాలుడు

మసీదుసెంటర్: జగన్నాథపురానికి చెందిన మూడేళ్ల బాలుడు యస్వంత్ ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ బాటిల్‌లోని పెట్రోలు తాగాడు. అస్వస్థతకు గురికావడంతో సోమవారం కుటుంబసభ్యులు జీజీహెచ్‌లో చేర్చారు.

టిన్నర్ తాగి.. సంజయ్‌నగర్‌కు చెందిన మూడేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ రంగుల్లో కలిపే టిన్నర్ తాగింది. అస్వస్థతకు గురికావడంతో సోమవారం కుటుంబసభ్యులు జీజీహెచ్‌లో చేర్చారు.

వాహనచోదకులకు జైలు, జరిమానా

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన 26 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారిలో ఒకరికి మూడు రోజులు, 10 మందికి రెండు రోజుల చొప్పున జైలు, మరో 15 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్-1, 2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 26 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలిపారు.

★ మద్యం తాగి వాహనం నడిపిన 12 మందిపై కాకినాడ పోర్టు పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. 11 మందికి రెండు రోజుల జైలు, ఒకరికి రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. పోర్టు పీఎస్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 12 మందిపై కేసులు నమోదు చేశామని పోర్టు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

యువత రక్తదానం
నరనరాన సేవాభావం

రక్తదానం ప్రాణదానంతో సమానం. వీరంతా ఆ విషయంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసిన వారి అభిప్రాయాలివి.. న్యూస్‌టుడే, గాంధీనగర్, సాంబమూర్తినగర్, మసీదుసెంటర్

గత ఆరేళ్లలో జీజీహెచ్‌లో ఇలా.. (యూనిట్లలో..)

ఏడాది	రక్త సేకరణ	వినియోగం
2019	12874	24971
2020	6899	11626
2021	7829	16738
2022	10029	18353
2023	11960	19562
2024 (ఇప్పటివరకు)	9186	13643

అందరూ ముందుకు రావాలి



సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నా. రక్తదానంపై మిత్రుల సహాయంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా. ఇప్పటి వరకు 8 సార్లు రక్తదానం చేశా. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. -ధర్మాడి సుధీర్

స్నేహితుడి కోసం తొలిసారి..



చదువుకునే సమయంలో నా స్నేహితుడు ప్రమాదం బారిన పడటంతో అప్పటికప్పుడు రక్తం కావాల్సి వచ్చింది. అప్పుడు తొలిసారి రక్తదానం చేశా. అప్పటి నుంచి ఏటా రెండు సార్లు రక్తదానం చేయడం అలవాటుచేసుకున్నా. ఇప్పటి వరకు 20సార్లు రక్తం, మూడుసార్లు ప్లేట్‌లెట్స్ ఇవ్వడం ఆనందంగా ఉంది. -రాజ్‌కుమార్, వ్యాపారి

తలసేమియా బాధిత చిన్నారులకు..



సమాజంలో వేలకు డబ్బులు, ఇతర సహాయాలను చాలా మంది చేస్తున్నారు. రక్తదానం మాత్రం కొందరే చేస్తున్నారు. అందులో మహిళలు చాలా అరుదని తెలుసుకున్నా. అనేక మంది తలసేమియా చిన్నారులను చూసి చలించిపోయా. నా వంతుగా రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నా. ఇప్పటి వరకు రెండు సార్లు రక్తదానం చేశా. ప్రతి మూడునెలలకోసారి రక్తదానం చేయడానికి నావంతు ప్రయత్నం చేస్తా. - కె.మహేశ్వరిదేవి, గృహిణి

రక్తదానంతో ఆరోగ్యంగానూ ఉంటాం..



ప్రతి మూడునెలలకోసారి రక్తదానం చేయడం వల్ల మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చు. నేను ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేశా. మనం చెప్పడమే కాకుండా చేసి చూపించాలని నటుడు చిరంజీవి చెప్పిన మాటలే ఆదర్శం. తరచూ హైదరాబాద్ వెళ్లినప్పుడల్లా అక్కడ రక్తదానం చేస్తుంటా. -బొల్లం సతీష్, శ్రీయువసేన బ్లడ్‌బ్యాంకు అధ్యక్షుడు

నా వంతు సహకారం..



బ్రహ్మధ్యాన సత్సంగ్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నా. నాది ఏబీ పాజిటివ్ రక్తం. ఇప్పటి వరకు 26 సార్లు రక్తదానం చేశా. రెండు సార్లు ప్లేట్‌లెట్స్ అందించా. మిత్రులతో కలిసి రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. -పేరాపు నాగగౌతమ్, రామకృష్ణారావుపేట

అవగాహనతో ముందుకు రావాలి



నాది బి పాజిటివ్ రక్తం. ఇప్పటికి 17 సార్లు రక్తదానం చేయడంతోపాటు 6 సార్లు ప్లేట్‌లెట్స్ అందించా. రక్తదానం వల్ల ఒకరి ప్రాణం నిలబడుతున్నందుకు ఎంతో ఆనందం కలుగుతుంది. అందరూ ఈ మంచి పని చేయడానికి ముందుకు రావాలి. -సలీం అర్జున్, సాంబమూర్తినగర్

కళాశాలలో చదువుతున్నప్పుడే..



ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నా. నాది బి పాజిటివ్ రక్తం. కళాశాల విద్య అభ్యసిస్తున్నప్పుడే రక్తదానం ఆవశ్యకత తెలుసుకున్నా. 17 సార్లు రక్తదానం చేశా. ఆరుసార్లు ప్లేట్‌లెట్స్ అందించా. తలసేమియా బాధితుల కోసం మిత్రుల సహాయంతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశాం. -దండిప్రోలు మహేష్

25 సార్లు రక్తదానం చేశా...



ఇప్పటి వరకు 25 సార్లు రక్తదానం చేశా. కాకినాడలో డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్న సమయంలో అత్యవసరంగా రక్తం కావాలని తెలియడంతో మొదటి సారి ఇచ్చా. గ్రూప్‌ల్లో స్టేటస్, మెసేజ్‌లు చూసి స్పందించి రక్తదానం చేస్తా. నాకు కుదరని సమయంలో స్నేహితులతో రక్తదానం చేయించా. -కాకినాడ సబ్‌జైల్ వార్డెన్ శుభాకర్‌రెడ్డి

ఎంపికలకు పోటెత్తిన క్రీడాకారులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికలకు పలు క్రీడాంశాల్లో జిల్లా జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. ఈ ఎంపికలను డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి బి.శ్యామ్‌కుమార్ అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఎంపికలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ పోటీలకు సుమారు 3,500 మంది క్రీడాకారులు హాజరయ్యారని అండర్-14, 17 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి, తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, కరాటే, రగ్బీ తదితర క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి చక్రవర్తి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఏవీ శ్రీనివాస్, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీలో సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న బాలికలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఎస్పీ కార్యాలయానికి 82 ఫిర్యాదులు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమక్షంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 82 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వివరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీటీఆర్బీ సీఐ ఎస్. గౌరీ శంకర్, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్‌కు సమస్యల వెల్లువ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణ, వీధి దీపాలు, తాగునీరు, ఆక్రమణలు వంటి సమస్యలపై డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని వినతులు పోటెత్తాయి. సోమవారం కమిషనర్ భావన ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఫోను ద్వారా వినతులు స్వీకరించారు. గంట వ్యవధిలో 19 మంది వివిధ సమస్యలను విన్నవించారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమెకు స్వయంగా 25 మంది అర్జీలు అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. వీటిపై కమిషనర్ ఆయా విభాగాల అధికారులతో అక్కడే సమీక్షించారు. గడువులోగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిశీలించి, పరిష్కార నివేదిక అందించాలని ఆదేశించారు. ప్రతీవారం వీటిపై సమీక్షిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న కమిషనర్ భావన

ఇటు రూ.కోట్లు.. అటు పాట్లు

రూ.కోట్లు వెచ్చించి రహదారి నిర్మించినా వాహనచోదకులకు పాట్లు తప్పడం లేదు. శారదాంబగుడి నుంచి ప్రభుత్వ ఐటీఐ వెనుక వరకు రూ.16 కోట్ల స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ నిధులతో రోడ్డు ఏర్పాటు చేశారు. కొండయ్యపాలెం పైవంతెనకు అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో 100 మీటర్ల మేర అభివృద్ధి పనులు ఆపేశారు. ఆ ప్రాంతం గుంతలమయంగా మారి మడుగును తలపిస్తోంది. వాహనాలు దానిలో దిగబడిపోతున్నాయి. కొన్నిసార్లు అదుపు తప్పుతున్నాయి. ఇక్కడ వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అప్పట్లో వైకాపా నాయకులు ఇక్కడనున్న వారి భూములకు ధర పెంచుకోడానికి హడావుడిగా రహదారిని ప్రతిపాదించి నిర్మించారు. పూర్తిస్థాయిలో రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ ఐటీఐ వెనుక చివరి భాగంలో రహదారి నిర్మాణం పూర్తిచేయక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్



పరిసరాల శుభ్రతపై ప్రజాచైతన్యం



అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం 100 వార్డు సచివాలయాల పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ ద్వారా చెత్త సేకరణకు ప్రతి కుటుంబానికి ఇచ్చిన వివిధ రంగుల డబ్బాల్లో తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలు వేర్వేరుగా భద్రపర్చి, ఇంటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సచివాలయ సిబ్బంది వివరించారు. వాణిజ్య, వ్యాపార సంస్థలు పెద్ద డబ్బాలు, సంచుల్లో భద్రపర్చి, కార్మికులను అందజేయాలని సూచించారు. స్వచ్ఛ కాకినాడకు అందరూ సహకరించాలని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని వివరించారు.

ఉద్యోగ మేళాలో 21 మంది ఎంపిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: యువత నైపుణ్యాలను మెరుగుపరచుకుని ఉద్యోగ మేళాల్లో పాల్గొనాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు అన్నారు. సోమవారం మెహర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. సుమారు 75 మంది పేర్లు నమోదు చేసుకోగా, ప్రాథమికంగా 21 మందిని ఎంపిక చేశారు. ప్లేస్‌మెంట్ అధికారి శ్యామ్, కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసు, కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

కాకినాడ నగరం: రక్తదానం పాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ కార్యదర్శి వై.డి.రామారావు అన్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో సోమవారం తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. 125 యూనిట్ల రక్త సేకరణ లక్ష్యంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ డా.తిరుపాణ్యంతో కలిసి రామారావు ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపల్ ఆంజనేయులు, డా.కె.జయదేవ్, డా.ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

అలముకున్న చీకట్లు



నగరంలో రాత్రిపూట చీకట్లు అలముకుంటున్నాయి. భాస్కర్‌నగర్, వెంకట్‌నగర్, రామకృష్ణారావుపేట, రేచర్లపేట, సాంబమూర్తినగర్ తదితర ప్రాంతాల్లో కొంతకాలంగా రాత్రులు వీధిదీపాలు వెలగడం లేదు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, చీకటి వీధిలో రాకపోకలు సాగించేందుకు భయందోళనకు గురవుతున్నామని వాహనదారులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు.

-న్యూస్‌టుడే, మసీదుసెంటర్

ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ

సాంబమూర్తినగర్: కాకినాడ సంకల్ప లైన్స్ క్లబ్ సౌజన్యంతో జగన్నాథపురంలోని బచ్చు రాము ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ డైరెక్టర్ లావణ్య మాట్లాడుతూ చదువులో ఉన్నతంగా రాణించాలంటే కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు జీవీఎస్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి, ఆర్జేసీ, ఈవో తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 3వ తేదీ నుంచి 12 వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే వనమాడికి ఈవో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి మాట్లాడుతూ తొమ్మిదిరోజుల పాటు జరిగే కార్యక్రమాలు, అమ్మవారి అవతారాలను వివరించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జి మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజులపాటు జరిగే వేడుకల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్జేసీ కె.సుబ్బారావు మాట్లాడుతూ ఆలయంలో ఉత్సవాలను గతంలో కంటే వైభవంగా నిర్వహించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఉండే పాస్‌ల విధానం తొలగించామన్నారు. నగర తెదేపా అధ్యక్షుడు వీరు, జనసేన నేత అశోక్, పురోహితులు సుబ్రహ్మణ్యం, నేమాని నాగేశ్వరరావు, బచ్చు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపం వెలగడం లేదు..

సమస్య: కాకినాడ మెహర్‌నగర్ జీపీటీ 1వ క్రాస్ రోడ్డులో 65-6-28 డోరు నంబరు వద్ద వీధి దీపం నెల రోజులుగా వెలగడం లేదు. రాత్రి చీకటి కారణంగా కుక్కల బెడద అధికంగా ఉంది.

-రాజగోపాల్, మెహర్‌నగర్

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపం వెలిగేలా చర్యలు చేపడతాం.

-సాంబశివరావు, ఏఈ, నగరపాలకసంస్థ

-న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: **91548 46719**

ఉద్యోగులకు సన్మానం

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సోమవారం సన్మానించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిపాలనా అధికారిని ఆదేశించారు. కాకినాడ ఏఆర్ ఎస్సైగా పని చేస్తున్న ఇల్లూరి వెంకటరమణరెడ్డి, తుని పట్టణ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చింతపల్లి వెంకటేశ్వరరావు ఉద్యోగ వివరమణ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, పోలీసు సిబ్బంది, ఉద్యోగ విరమణ చేసిన వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



పోలీసు అధికారిని సత్కరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

సత్యదేవునికి పంచామృతాభిషేకం

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి జన్మనక్షత్రం మఖ పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో ఆయుష్యహోమం, పూర్ణాహుతి జరిగింది.

ఆంధ్రా అరుణాచలానికి భక్తుల తాకిడి

ప్రత్తిపాడు: రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి గాంచిన క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అరుణాచలేశ్వరుడు, అపీత కుచాంబ అమ్మవారు, ఉపాలయాల్లో పూజలు చేశారు. శ్రీరమణసేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట



ప్రదర్శనలో రమేష్, జనసేన కార్యకర్తలు

జనసేన ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన

గండేపల్లి (జగ్గంపేట), న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సోమవారం జగ్గంపేట రావులమ్మతల్లి ఆలయం నుంచి కాకినాడ రోడ్డులోని కృష్ణాలయం వరకు జనసేన ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. జగ్గంపేట జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్ పోటీల్లో విజేతలు

గండేపల్లి, న్యూస్‌టుడే: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం క్యారమ్స్ పోటీలు నిర్వహించినట్లు ప్రోఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో కౌసిక్, లాస్య ప్రథమ, బలరామకృష్ణ, శ్రామిణిశ్రీ ద్వితీయ స్థానం సాధించారన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో అధ్యాపకులు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

పైపులైనుకు మరమ్మతులు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మామిడాడలో ప్రధాన రహదారిని ఆనుకుని పైపులైను లీకులు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. గ్రామానికి చెందిన శేషగిరిరావు సమస్యను వివరించడంతో సిబ్బంది పైపులైనుకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టారు.

సమయం: ఉ. 10 గం. నుంచి మ. 12 గంట మధ్య మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

భూముల క్రయవిక్రయాల్లో నిబంధనలు పాటించాలి



యనమలను కలిసిన సబ్ రిజిస్ట్రార్ సుబ్బారెడ్డి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: భూముల క్రయవిక్రయాల్లో నిబంధనలు పాటించి ప్రభుత్వ ఆదాయం పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని తుని సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బారెడ్డికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. సోమవారం తేటగుంటలోని తెదేపా కార్యాలయంలో యనమలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు, తెదేపా నాయకులు యనమల సత్యనారాయణ, యనమల రాజేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

శంఖవరం: జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు అన్నారు. కత్తిపూడి జాతీయ రహదారిపై సోమవారం ఆయన ట్రాఫిక్ నిలిపివేసిన వాహనాలపై చర్యలు చేపట్టారు. వాహన చోదకులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా రహదారిపై హెచ్చరిక బోర్డులు పెట్టించారు. కాకినాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం వెళ్లే రహదారులు కూడా కావడంతో నిత్యం సిబ్బందిని ఉంచి ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తామన్నారు. అన్నవరం ఎస్సై కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

గండేపల్లి: సూరంపాలెంలోని పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు డీజీఎం పవన్‌కుమార్ తెలిపారు. పవర్‌గ్రిడ్ సిబ్బంది, గ్రామస్థులకు వైద్యులు కిరణ్మయి, తేజస్విని, సతీష్‌రెడ్డి, హరికృష్ణ వైద్య పరీక్షలు చేశారు.

అంధత్వ రహిత సమాజానికి కృషి చేద్దాం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. సిరిపురంలో తెదేపా ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బచ్చల శివ, నాయకులు కాకర జార్జి, వనుం మంగ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటైన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సర్పంచి పి.నూకరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం వైద్యుడు రమేష్ పాల్గొని 135 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 16 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి గౌతమి ఆసుపత్రికి పంపారు.

రక్తదాతలు.. ఆపద్బాంధవులు

• నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



నీలాద్రిరాజును సన్మానించిన రక్తనిధి కేంద్రం సిబ్బంది (పాత చిత్రం)

తుని, న్యూస్‌టుడే: అత్యవసర సమయాల్లో వివిధ గ్రూపుల రక్తం సమకూర్చి రోగులు, క్షతగాత్రులను ఆదుకోవడానికి అనేక మంది యువత పట్టణ పరిసరాల్లో సిద్ధంగా ఉన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా, వాట్సాప్ గ్రూపులు నిర్వహిస్తూ వందల మంది రక్తదాతలు ముందడుగు వేస్తున్నారు. తునిలో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రితోపాటు బయట మరో ప్రైవేటు బ్లడ్ బ్యాంకు ఉంది. వీటి ద్వారా నిత్యం అనేక మందికి పలు గ్రూపుల రక్తం అందుతుండటంతో వారు ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడగలుగుతున్నారు.

ఆదుకోవడంలో ఆనందం..

గత 12 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నాను. ప్రస్తుతం నా వయసు 60 సంవత్సరాలు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎంతో ఆనందం కనిపిస్తుంది. ఆరోగ్యం సహకరించినంత కాలం తప్పకుండా రక్తదానం చేసి పది మంది ప్రాణాలు కాపాడాలనేది నా ఆశ. యువత మరింత మంది ముందుకు వస్తే అత్యవసర వేళల్లో ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

\- కె.నీలాద్రి రాజు, తుని

29సార్లు ఇచ్చిన స్వామి..



స్వామికి సత్కారం (పాత చిత్రం)

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఎవరైనా ఆపదలో ఉన్నారంటే ఆదుకునేందుకు ఈ యువకుడు ముందు వరసలో ఉంటారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలంటే నేనున్నానంటూ వచ్చి ఆదుకుంటారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తికి చెందిన గ్రంధి స్వామి విద్యుత్తు బిల్లులు తీసి వినియోగదారులకు అందజేసే ఉద్యోగం నిర్వహిస్తుంటారు. వచ్చే కొద్దిపాటి గౌరవ వేతనంలో కొంత సొమ్మును సేవకు వినియోగిస్తుంటారు. ఆయన వయసు 30 సంవత్సరాలు కాగా ఇప్పటి వరకు 29 సార్లు రక్తదానం చేశారు. రక్తదాతగా పేరు తెచ్చుకున్న స్వామిని ఏలేశ్వరం, గ్రామీణ మండలంలో స్వచ్ఛంద, విద్యా సంస్థలు సన్మానించాయి. రక్తం అందక ఎవరూ విలువైన ప్రాణాలను కోల్పోకూడదనే తాను అత్యవసర వేళ అండగా ఉంటానని స్వామి అంటున్నారు. రక్తదానం చేయడంలో ఉన్న అపోహలను తొలగించాడానికి యువతకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

శత రక్తదాత సూర్యకిరణ్



మెగాస్టార్ చిరంజీవితో మేడిశెట్టి సూర్యకిరణ్ (పాత చిత్రం)

శంఖవరం, న్యూస్‌టుడే: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం వెలకట్టలేనిది. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసేందుకు అందుబాటులో ఉంటారు... శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి సూర్యకిరణ్(బాబీ). ఇప్పటి వరకు 100 మందికి రక్తదానం చేశారు. రక్తం లేక ఎవరూ ప్రాణాలు పోగొట్టుకోకూడదనే తన అభిమాన సినీహీరో చిరంజీవి మాటలు స్ఫూర్తినిచ్చాయని ఆయన చెబుతుంటారు. బాబీ సేవలను గుర్తించి మెగాస్టార్ చిరంజీవి పలుమార్లు ప్రసంశించారు. రోటరీ క్లబ్, ఇతర రక్తనిధి కేంద్రాలు, ఛారిటబుల్ ట్రస్ట్‌లు ఇప్పటికే బాబీని పలుమార్లు సన్మానించాయి. రక్తదానం చేయడంలో అపోహలను తొలగించి యువతీ, యువకుల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

అత్యవసరానికి ఆసరాగా..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు సీహెచ్‌సీలో రక్త నిల్వ కేంద్రం అత్యవసర సేవలకు అందుబాటులో ఉంటోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈసీహెచ్‌సీలో మాతా శిశుసంరక్షణ కేంద్రం (సీమాంక్) ఉండడంతో రక్తం అవసరమయ్యే అన్ని రకాల కేసులు వస్తుంటాయి. రక్తదాన ఆవశ్యకతపై ఆసుపత్రి సందర్శకులను చైతన్య పరుస్తుంటామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపారు. ప్రత్తిపాడు సీహెచ్‌సీలో 2007 నుంచి నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో 60 యూనిట్ల బ్లడ్‌ను నిల్వ ఉంచుకునేలా రిఫ్రిజిరేటర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఏ పాజిటివ్, బీ పాజిటివ్, ఓ పాజిటివ్ గ్రూపులకు సంబంధించి 7 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని ఎల్‌టీ సుబ్బారావు తెలిపారు. తునిలోని బ్లడ్ బ్యాంకు ద్వారా అవసరమైన యూనిట్లు ఇక్కడి నిల్వ కేంద్రానికి సరఫరా చేస్తున్నారు. సీమాంక్ కేంద్రంలో ప్రసూతి సేవలకు ఈ రక్త నిల్వ కేంద్రం చేదోడు అవుతోంది.



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో రక్త నిల్వ విభాగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

సభ్యత్వ నమోదుతో తెదేపా మరింత బలోపేతం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదుతో తెదేపా మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తెదేపా నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడుతూ శ్రేణులంతా సాంకేతిక వనరులను వినియోగించుకోవడంతో పాటు, సామాజిక మాధ్యమాలను అనుసరించాలని సూచించారు. వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా సభ్యత్వ నమోదుపై పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ శివశంకర్ అవగాహన కలిగించారు. నాయకులు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, నాయకులు పర్వత సురేష్, సూతి బూరయ్య అమరాది వెంకట్రావు, పైల సాంబశివ, బద్ది రామారావు, మూది నారాయణస్వామి, బొల్లు కొండబాబు, ఏసుబాబు, కృష్ణబాబు, గోపి పాల్గొన్నారు.

కోటి బిల్వార్చన గోడపత్రికల విడుదల

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో మినర్వా విద్యా సంస్థల ఎదురుగా ఉన్న ప్రదేశంలో నవంబరు 4న అయ్యప్పస్వామికి కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ సోమవారం విడుదల చేసింది. గ్రామాల్లో గురుస్వాములకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు అందజేసింది. శబరిమలై సన్నిధానం ప్రధాన పూజారి మేల్‌శాంతి పూజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని తెలిపారు.



గోడపత్రికలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఆంధ్రా అరుణాచలానికి భక్తుల తాకిడి

ప్రత్తిపాడు: రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి గాంచిన క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అరుణాచలేశ్వరుడు, అపీత కుచాంబ అమ్మవారు, ఉపాలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరమణసేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



రాచపల్లి అరుణాచలేశ్వర సన్నిధిలో భక్తజనం

సత్యదేవునికి పంచామృతాభిషేకం

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి జన్మనక్షత్రం మఖ పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో ఆయుష్యహోమం, పూర్ణాహుతి జరిగింది.

3 నుంచి దసరా ఉత్సవాలు

శంఖవరం: సీతంపేట దుర్గామీనాక్షి అమ్మవారి ఆలయం వద్ద దసరా మహోత్సవాలు 3 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన గోడపత్రికలను ఆలయ పండితుడు సతీష్‌శర్మ, ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

ప్రత్తిపాడు ఎస్సైగా లక్ష్మీకాంతం



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎస్సైగా లక్ష్మీకాంతం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కాకినాడ నుంచి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు స్నేహపూర్వకంగా ప్రజలకు అండగా నిలుస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గండేపల్లి (జగ్గంపేట), న్యూస్‌టుడే: కాకినాడలోని డీఎస్సీ మైదానంలో ఆదివారం జరిగిన పోటీల్లో జగ్గంపేటకు చెందిన సూర్యకిరణ్ (వెయిట్ లిఫ్టింగ్) ప్రసన్నకుమార్, రాణి (పవర్ లిఫ్టింగ్)లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరాటే శిక్షకుడు రమణ తెలిపారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: రామకృష్ణా మోటారు వర్కర్స్ యూనియన్ సభ్యులు 50 మందికి గతంలో తెదేపా ప్రభుత్వం అందించిన ఇళ్ల పట్టాలను పునరుద్ధరించాలని సోమవారం తహసీల్దారు ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల నిర్మాణాలు చేపట్టలేకపోయామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసే రుణ సదుపాయంతో ఇళ్లు కట్టుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

శ్మశానవాటిక ఆక్రమించారని ఫిర్యాదు

తొండంగి: కోదాడలో శ్మశానవాటికను ఏవీనగరానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌తో దున్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని సోమవారం గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దారు మురార్జీని వివరణ కోరగా, అది జిరాయితీ లేదా ప్రభుత్వ భూమా అనేది సర్వే చేయించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: గోనేడలోని ఏలేరు ప్రధాన కాలువలో ఆదివారం సాయంత్రం కోలా సత్యనారాయణ(61) గల్లంతుకాగా, పెద్దాపురం మండలం కాండ్రకోట వద్ద సోమవారం మృతదేహం లభ్యమైంది. ఎస్సై జి.సతీష్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు కోలా నాగార్జున ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సత్యనారాయణ (పాతచిత్రం)

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

తుని, న్యూస్‌టుడే: పట్టణంలో అమ్మాజీపేట ప్రాంతానికి చెందిన ఎం.స్వర్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం చినదొడ్డిగొల్లు ప్రాంతానికి చెందిన పి.సూరిబాబుతో ఆమె కలిసి ఉండేదన్నారు. ఆమె 2016లో ఖత్తర్ వెళ్లి ప్రతినెలా జీతం డబ్బు 2022 ఫిబ్రవరి వరకూ సుమారు రూ. 78 లక్షలు సూరిబాబుకు పంపారన్నారు. తిరిగి ఆమె 2023 డిసెంబరులో వచ్చి సదరు వ్యక్తితో కలిసి కొంతకాలం ఉన్నారన్నారు. ఈ ఏడాది జనవరిలో డబ్బులు ఇవ్వాలని అడగ్గా ఇవ్వకుండా మోసం చేశాడని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట గ్రామీణం: మామిడాడ పరిసరప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. ఒకరిని అదుపులోకి తీసుకుని 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నలుగురు జూదరులపై కేసు

శంఖవరం, న్యూస్‌టుడే: కత్తిపూడి శివారు తోటల్లో సోమవారం రాత్రి జూదమాడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు అన్నవరం ఎస్ఐ కిశోర్ తెలిపారు. వారి నుంచి రూ. 4,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కమిషనర్ తీరుపై కౌన్సిల్ ఆగ్రహం

• సమావేశం బహిష్కరణ

తుని, న్యూస్‌టుడే: పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావు తీరుపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశమైంది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 5వ వార్డు కౌన్సిలర్ మర్రా సత్యవతికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అజెండాలో అంశాలపై చర్చ ప్రారంభిస్తున్న సమయంలో కౌన్సిలర్లు కర్రి సత్య జగదీష్, షేక్ ఖ్వాజా, వాసంశెట్టి శ్రీను, ఏలూరి బాలు మాట్లాడుతూ కౌన్సిలర్ సత్యవతి మృతిచెందిన నేపథ్యంలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని ఎందుకు వాయిదా వేయలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఆయన వివరణ ఇస్తూ ప్రభుత్వం చేపట్టిన పథకం, అన్ని చోట్లా ఒకే సారి ప్రారంభం కావాలని ఆదేశాలుండటంతో వాయిదా వేయలేకపోయామన్నారు. కౌన్సిల్ సభ్యురాలు మృతి చెందినట్లు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు తెలియజేశారా? అంటూ కౌన్సిలర్లు నిలదీశారు. రెండుసార్లు ఎన్నికైన వ్యక్తి చనిపోతే కనీసం మానవతా దృక్పథంతో వ్యవహరించ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ వ్యవహార శైలిని నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ఒకరిద్దరు మినహా మెజారిటీ కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోయారు. దీంతో అజెండాలోని 26 అంశాలు చర్చించే అవకాశం లేదని చెబుతూ సమావేశాన్ని వచ్చేనెలకు వాయిదా వేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించి బయటకు వెళ్లిపోయారు.





బయటకు వెళ్లిపోతున్న కౌన్సిల్ సభ్యులు (అంతర చిత్రం) ఛైర్‌పర్సన్ సుధారాణి



శిక్షణ పొందిన అభ్యర్థులతో నవీన్‌కుమార్

టెట్‌లో ఉన్నత మార్కులు సాధించాలి

గండేపల్లి(జగ్గంపేట), న్యూస్‌టుడే: శిక్షణ పొందిన అభ్యర్థులంతా టెట్‌లో ఉన్నతమైన మార్కులు సాధించి డీఎస్సీకి సిద్ధం కావాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో 600 మంది అభ్యర్థులకు రెండు నెలలపాటు నిర్వహించిన ఉచిత శిక్షణ సోమవారంతో ముగిసింది. 3వ తేదీ నుంచి జరిగే టెట్ పరీక్షల్లో అభ్యర్థులు మంచి మార్కులు సాధించి ఫౌండేషన్‌కు, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని నవీన్‌కుమార్ ఆకాంక్షించారు. తెదేపా నాయకులు జీను మణిబాబు, కొత్త కొండబాబు, టెట్ శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సాయంతో రెండేళ్లుగా అన్న క్యాంటీన్

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: రెండేళ్లుగా జగ్గంపేటలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామంటే తెదేపా కుటుంబ సభ్యులు, దాతల కృషేనని తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. జగ్గంపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శివప్రసాద్, క్రాంతి దంపతులు ఆర్థికసాయంతో సోమవారం అన్న క్యాంటీన్ నిర్వహించారు.



మొక్క నాటుతున్న సర్పంచి శ్రీలలిత, నాయకులు

కొబ్బరి మొక్కలు నాటారు..

కిర్లంపూడి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడిలోని మూడెకరాల శ్మశానవాటికలో తుప్పలను తొలగించి సిమెంట్ రోడ్డు వెంబడి రెండు వందల కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. సర్పంచి మహేంద్రాడ శ్రీలత, నాయకుడు గుడాల రాంబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండల తెదేపా అధ్యక్షుడు చదరం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మొక్కలను పెంచి పర్యావరణాన్ని రక్షించాలని తెదేపా నాయకుడు యనమల రాజేష్ అన్నారు. తొండంగిలో సోమవారం కార్యదర్శి అప్పారావు, ఏపీవో రామచంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటారు.



గర్భిణులకు సామూహిక సీమంతాలు..

పౌష్టికాహార ఆవశ్యకత తెలుసుకోవాలి

తుని పట్టణం, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార ఆవశ్యకత తెలుసుకోవాలని పురపాలకసంఘం మాజీ ఛైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, సీడీపీవో కె.శ్రీలత సూచించారు. సోమవారం స్థానిక బ్యాంకు కాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ప్రతినిధులు ఇచ్చిన చీరలు, చిక్కీలు, పండ్లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఏసీడీపీవో నిహారిక, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు నళిని, విజయ, అనురాధ, దేవి, పద్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కృషి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వార్డుల్లో నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ సోమవారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏఈ అనూష లక్ష్మి పాల్గొన్నారు.

వంగవీటి రాధాకృష్ణ ఆరోగ్యం బాగుండాలని పూజలు

తుని, అన్నవరం, న్యూస్‌టుడే: వంగవీటి రాధాకృష్ణ ఆరోగ్యం బాగుండాలని ఆకాంక్షిస్తూ కాపునాడు రాష్ట్ర యువత కార్యనిర్వాహక కార్యదర్శి సూరపురెడ్డి శ్రీనివాస్ సోమవారం పాదయాత్ర చేపట్టారు. తునిలో ఆంజనేయస్వామి గుడి వద్ద పాదయాత్ర ప్రారంభించి జాతీయ రహదారి మీదుగా సాయంత్రానికి అన్నవరం చేరుకున్నారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకుని పూజలు చేశారు.



పాదయాత్రలో శ్రీనివాస్ తదితరులు

నానో ఎరువుల వాడకం లాభదాయకం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇఫ్కో నానోఎరువుల వాడకంతో రానున్నరోజుల్లో సాగులో విప్లవాత్మక మార్పులు రానున్నాయని జిల్లా మేనేజర్ గుంటక శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో సోమవారం నానో ఎరువులు, కిసాన్ డ్రోన్‌ల ఉపయోగాలను రైతులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వీటితో రైతులకు లాభదాయకంగా ఉంటాయన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా మొక్కలు అందజేశారు. ఇఫ్కో సిబ్బంది దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్లతో భయం భయం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఏలేరు వరద రోడ్లను ఛిద్రం చేసింది. వరదనీరు పారడంతో కోతకు గురయ్యాయి. వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజుపాలెం నుంచి వీరవరం గ్రామాల మధ్య ప్రధాన ర.భ.రహదారికి పలు చోట్ల రోడ్డు అంచు కోతకు గురయ్యాయి. రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనచోదకులు హడలిపోతున్నారు. రాజుపాలెం నుంచి ముక్కొల్లు వెళ్లే రోడ్డులో వాలుకాలువ వంతెనను ఆనుకుని కోతకు గురికాగా, ఇసుక బస్తాలు వేశారు. వరద నీటి ఉద్ధృతికి బస్తాలు కిందికి జారిపోయాయి. వంతెన అప్రోచ్ కొంతమేర మలుపు ఉండడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.



వాలుకాలువ వంతెన వద్ద ఇసుక బస్తాలతో...

అప్రోచ్‌లు మాయం

గోనేడ నుంచి రామవరం వెళ్లే ర.భ.రోడ్డుకు రెండు వైపులా కోతకు గురయింది. రామకృష్ణాపురం నుంచి గెద్దనాపల్లి వెళ్ళే రోడ్డు పలు చోట్ల దెబ్బతింది. రోడ్లను మెరుగుపరిచి ప్రమాదాలకు గురికాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈఈ వర్మ, పంచాయతీరాజ్‌శాఖ ఏఈఈ నారాయణలను వివరణకోరగా రోడ్లు కోతకు గురైన ప్రదేశాలను గుర్తించి అత్యవసర పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు సమకూరిన వెంటనే రక్షణ చర్యలు చేపడతామన్నారు.



రాజుపాలెం-వీరవరం రహదారిలో దెబ్బతిన్న అంచు

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

లోవరెడ్డి రికార్డు




పెద్దాపురం: రక్తం దానం చేయాలంటే ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటారు పెద్దాపురం పట్టణం రెడ్డిపేటకు చెందిన సంకురాయ్ లోవరెడ్డి. పట్టణంలో ప్రైవేటుగా ఫొటో స్టూడియో, జెరాక్స్ దుకాణం నడుపుకుంటారు. ఈయన 1996 నుంచి ఇప్పటి వరకు సుమారు 60 సార్లు ఎందరికో రక్తదానం చేశాడు. పట్టణంలో రోటరీ క్లబ్, సాయిబాబా, మన పెద్దాపురం గ్రూప్, ఇతర స్వచ్ఛంద సంస్థలు రక్తదానం శిబిరాలు నిర్వహిస్తే అక్కడకు వెళ్లి రక్తదానం చేస్తారు. ఆపదలో ఉన్న మనుషులకు రక్తదానం చేసి ప్రాణాలు నిలబెట్టడంలో ఉన్న ఆనందం మరేదానిలో రాదంటారాయన.

స్నేహితుడి ప్రమాదం నుంచి మొదలు



సంతోష్‌కుమార్

కాకినాడ గ్రామీణం: రమణయ్యపేట రాయుడుపాలేనికి చెందిన తురగా సంతోష్‌కుమార్ వ్యాపారి. 2004 నుంచి రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 17 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. స్నేహితుడికి ప్రమాదం జరిగినప్పుడు రక్తం అవసరాన్ని గుర్తెరిగి తాను దానం చేయడం ప్రారంభించినట్లు చెప్పారు.



మాతాజి ఫౌండేషన్ 500 మందికి..

గొల్లప్రోలు మండల చేబ్రోలులో 2018 సంవత్సరంలో మాతాజి ఫౌండేషన్ ఏర్పాటుచేసి రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. 200 మంది చిరుద్యోగులు, చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే యువకులు సభ్యులుగా ఉన్నారు. ఆరేళ్లలో 500 మందికి రక్తదానం చేశారు.



రక్తాన్ని పంచి.. ప్రాణాన్ని నిలిపి

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

సాంకేతికత ఎంత పెరిగినా కృత్రిమంగా తయారు చేయలేని వాటిల్లో రక్తం ఒకటి. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు.. శస్త్ర చికిత్సలు, వ్యాధుల్లో రక్తహీనతతో సరైన సమయానికి రుధిర నిల్వలు అందుబాటులో లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రక్తదానం.. ప్రాణదానంతో సమానం. తక్షణం స్పందించే తత్వం.. నిండు ప్రాణాన్ని నిలబెడుతుంది. ఆ కుటుంబానికి జీవనజ్యోతిగా మారుతుంది. ఎంతో మంది ఈ స్ఫూర్తిని చాటుతున్నారు. మరికొందరు ఇతరులకు ప్రేరణ కల్పిస్తున్నారు. బాధితులు, దాతలను సమన్వయం చేస్తూ భరోసా కల్పిస్తున్నారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు, సర్పవరం జంక్షన్, కరప, పెద్దాపురం



గొల్లప్రోలులో స్టాండ్ ఫర్ ది సొసైటీ సభ్యుల రక్తదాన శిబిరం


40 సార్లు రక్తమిచ్చారు..

గొల్లప్రోలుకు చెందిన ముత్తింటి రమేష్ 40 సార్లు రక్తదానం చేశారు. ఈనెల 2వ తేదీన గొల్లప్రోలులో ఏర్పాటుచేసిన శిబిరంలో 40వసారి రక్తదానం చేసిన రమేష్‌ను స్థానిక ప్రతినిధులు, నాయకులు అభినందించారు. 1996 సంవత్సరంలో మొదటగా రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.

రెండేళ్లలో 750 మందికి..

గొల్లప్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది సభ్యులతో స్టాండ్ ఫర్ ది సొసైటీ రెండేళ్ల క్రితం ఏర్పాటైంది. తద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తాన్ని అందించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. ఈ సొసైటీలో ప్రస్తుతం 650 మంది సభ్యులుగా ఉన్నారు. మొగలి దత్తు అధ్యక్షుడిగా ఉన్న ఈ సంఘం రెండేళ్లలో 750 మందికి రక్తదానం చేశారు.





600 మందితో దాతల గ్రూప్ ఏర్పాటు

కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన కుమారుడు పంతం సందీప్ నిర్వహణలో నియోజకవర్గంలోని కరప, కాకినాడ గ్రామీణ మండలాలు, అర్బన్ డివిజన్ల పరంగా జనసైనికుల రక్త నమూనాలు సేకరించి వారి గ్రూపులు నిర్ధారించి డేటాను భద్రపరిచారు. నియోజకవర్గంలోని ప్రజలకు రక్తం అవసరమైనప్పుడు వీరి ద్వారా రక్తదానం చేయించి ప్రాణాలు కాపాడేందుకు రంగం సిద్ధం చేశారు.

24 ఏళ్లలో 75 సార్లు



కాకినాడ గ్రామీణ నియోజకవర్గం కొవ్వాడ గ్రామానికి చెందిన ముమ్మిడి వెంకటరమణ (చిన్ని) గత 24 సంవత్సరాలుగా 75 సార్లు రక్తదానం చేసి ఆపదలో ఉన్న రోగులు ప్రాణాలు కాపాడటానికి సహాయపడ్డారు. పలువులు అభినందనలు పొందారు. స్నేహితులను కూడా రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు.

నా వంతు సాయం



ఆపదలో ఉన్న వారికి నా వంతు సాయం చేయాలన్నదే నా ఆకాంక్ష. నాది బి.నెగిటివ్ గ్రూప్. అత్యవసర సమయంలో నా రక్తం మరొకరి ప్రాణాలు నిలబెడుతుందంటే ఆ అనుభూతి చెప్పలేనిది. – మాదవరపు శివప్రసాద్, కరప



మేమున్నాం.. మీకు తోడుగా

పూడిక తీశారు.. రోడ్డుపై ధూళి వదిలారు

సమస్య: పట్టణంలో వర్షపునీరు, మురుగు ఏలేరు కాలువలోకి వెళ్లేందుకు ఉన్న కాలువలో పూడిక తొలగించారు. పూర్తిస్థాయిలో మట్టిని తీయకపోవడంతో దుమ్ము రేగుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బందవుతోంది. – మేడిశెట్టి శివ, సామర్లకోట

సమాధానం: మట్టిని ట్రాక్టర్ల సాయంతో తొలగించాం. ధూళి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. - రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

– న్యూస్‌టుడే, సామర్లకోట

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:	
కాకినాడ గ్రామీణం:	80085 74325
పెద్దాపురం:	80085 74198
పిఠాపురం:	80085 65544






వైకాపా పాలనలో కుంటుపడిన గ్రామాభివృద్ధి


కాజులూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. కాజులూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాతా భారతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. తొలుత వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో సంక్షేమం పేరు చెప్పి రూ. కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్క పథకం అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకోవడానికి అక్టోబరు 4 నుంచి గ్రామల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. ఎంపీడీవో నాగేశ్వరశర్మ, తహసీల్దారు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్









శరన్నవరాత్రుల కరపత్రాలు ఆవిష్కరణ

తాళ్లరేవు: గ్రాంటు పాలకనకదుర్గమ్మ శరన్నవరాత్రుల కరపత్రాలను ఆలయ ప్రధాన అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ, అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 3న దేవీ శరన్నవరాత్ర దీక్షా ప్రారంభ కలశస్థాపన, 4న బాల పూజ, 5న వేద పారాయణం, 6న ఆధ్యాత్మిక ప్రవచనం, 7న లలితా సహస్ర పారాయణం, 8న గోపూజ, పది అవతారాల్లో అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

రూ.20 వేలు తక్షణం అందించాలి

తాళ్లరేవు: వరద తాకిడికి గురైన పంట పొలాలకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వం ఇస్తానన్న అన్నదాత సుఖీభవ సాయం రూ.20 వేలు తక్షణమే సాగుదారులకు అందించాలని సీపీఎం కౌలురైతుల మండల శాఖ సోమవారం డిమాండ్ చేసింది. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో కౌలురైతుల సీపీఎం మండల శాఖ సమావేశం చల్లా సంతోష్‌కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సీపీఎం జెండాను పలివెల సింహాచలం ఎగురవేశారు. కార్యదర్శి నివేదికను వల్లు రాజుబాబు సమావేశంలో ప్రవేశపెట్టారు.

తాళ్లరేవు తహసీల్దార్‌గా త్రినాథ్

తాళ్లరేవు: తాళ్లరేవు తహసీల్దార్‌గా పితాని త్రినాథ్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఉప తహసీల్దారు సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు, సర్వేయర్లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

✦ తాళ్లరేవు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా శ్రీనివాస్

పెద్దాపురం: సీపీఎం పట్టణ కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్ ఎంపికయ్యారు. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు స్మారక భవనంలో సీపీఎం శాఖ మహాసభ నెక్కల నరసింహమూర్తి అధ్యక్షతన జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, యాసలపు రమేష్, డి.కృష్ణ, ఆర్.వీర్రాజు, జి.పెంటయ్య, సీపీఎం జిల్లా నాయకుడు కరణం ప్రసాదరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

తాళ్లరేవు: తాళ్లరేవు మండలం కోరంగి శ్రీబాలభారతి విద్యానికేతన్ విద్యార్థులు, తల్లిదండ్రులు, స్నేహితుల ద్వారా విజయవాడలోని వరద బాధితులకోసం సేకరించిన రూ.50,001ను ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కు రూపంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు మురమళ్లలో ప్రిన్సిపల్ పితాని బాలవెంకటరమణ సోమవారం అందించారు. ఎమ్మెల్యే విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. కరస్పాండెంట్ శ్రావణకుమారి, ప్రధానోపాధ్యాయులు బొంతు ఈశ్వర్‌ప్రసాద్, ఉపాధ్యాయులు గండి నాని, బొడ్డు చంద్రశేఖర్, వైదాని దేవి, విత్తనాల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మురమళ్లలో బుచ్చిబాబుకు చెక్కు ఇస్తున్న బాలవెంకటరమణ





ఒండ్రుమట్టితో భూసారం పెరుగుదల

మీ కోసం

పి.గన్నవరం: గోదావరి వరదలు లంకగ్రామాల ప్రజలను, రైతులను ఇబ్బందికి గురిచేస్తుంటాయి. అయితే వరదనీటిలో కొండల నుంచి కొట్టుకొచ్చిన మట్టి డెల్టాభూముల్లో ఒండ్రుమట్టిగా పోయడంతో భూసారం బాగా పెరుగుతుంది. దీంట్లో సహజసిద్ధమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రకృతి వ్యవసాయ సాగు ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్ వివరించారు. ఈ ఒండ్రుమట్టి భూసారాన్ని బాగా పెంచుతుందన్నారు. ప్రధానంగా నాలుగు రకాల పోషకాలు ఉంటాయి

1) **స్థూల పోషకాలు:** నత్రజని, భాస్వరం, పొటాష్ కలిసి ఉంటాయి.

2) **ద్వితీయ పోషకాలు:** కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్ మిళితమై ఉంటాయి

3) **సూక్ష్మ పోషకాలు:** జింక్, ఇనుము, మాంగనీస్, రాగి ఉంటాయి.

4) **అతిసూక్ష్మ పోషకాలు:** బోరాన్, మేలిబ్డీనియం, నికిల్, కోబాల్ట్, సోడియం సమపాలల్లో ఉంటాయి.


కొబ్బరితోటల్లో వరదనీరు... దీంట్లోనే సారవంతమైన ఒండ్రుమట్టి కలిసి ఉంటుంది

రైతులు ఇలా చేయాలి

వరదనీరు పూర్తిగా తొలగిన తరువాత కొబ్బరితోటల్లో పైపాటుగా దుక్కిదున్ని నవధాన్యాల విత్తనాలు మిశ్రమంగా లేదా లైన్‌షోయింగ్(విడిగా) చల్లాలి. వీటితో భూసారం మరింత పెరుగుతుంది. ఇలా చేస్తే ఏడాదిపాటు ఎలాంటి ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదని ఎలియాజర్ సూచించారు.

వరిలో ఎండాకు తెగులును అరికడదాం

తెలుసుకుందాం..

చాగల్లు, అనపర్తి గ్రామీణం న్యూస్‌టుడే

అధిక వర్షాల కారణంగా వరి పంటపై ఎండాకు తెగులు వ్యాపిస్తుంది. ఈ తెగులు నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, అనపర్తి ఏవో సురేష్‌కుమార్ తెలిపారు.

● **తెగులు నిర్ధారణ ఇలా:** ఎండిన ఆకులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. తెగులు సోకిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి స్రవించడం వల్ల కొన్ని గంటల తరువాత నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారడం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటకు ఎండాకు తెగులు ఆశించినట్లు గుర్తించవచ్చు.

● **నివారణ చర్యలు:** బాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు 5శాతం కంటే ఎక్కువగా ఉంటే, పై పాటుగా వేయాల్సిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేసి, ఎండలు కాసిన తరువాత మాత్రమే వేసుకోవాలి. సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరెట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా వేయాలి. తెగులు వ్యాప్తిని కొంత వరకు అరికట్టడానికి లీటరు నీటికి 0.5-1 గ్రాముల స్ట్రెప్టోమైసిన్ ,టెట్రాసైక్లిన్ హైడ్రో క్లోరైడ్, కాపర్ హైడ్రాక్సాయిడ్ 2 గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తిస్తే, దాని నివారణకు ఒక లీటరు నీటిలో ఎసిఫేట్ 1.5గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3మీ.లీ పిచికారీ చేయాలి.

పెట్టుబడి తగ్గించి.. ఆదాయం పెంచి

స్ఫూర్తి

ఉప్పలగుప్తం: వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులను తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అన్నదాతలు కృషి చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర, వంటి పైర్లను సాగు చేస్తున్నారు. ఉప్పలగుప్తం మండలం విలసవిల్లికి చెందిన రైతు జి.రామకృష్ణ రసాయన రహిత సాగు చేస్తున్నారు. తనకున్న ఎకరం పొలంలో వరితో పాటు, పొలం గట్లపై వంకాయ, ఆనబ, చిక్కుడు, ఆకు కూరలను పండిస్తున్నారు.

ఆరోగ్యకరమైన సాగు..

అయిదేళ్లుగా సేంద్రియ సాగు చేస్తున్నారు. పచ్చిరొట్ట పైరును వేసి పూతదశలో చేలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుంది. ఆవులు, గేదెలను కొనుగోలు చేశారు. వాటి పేడ, మూత్రాలతో ద్రవ రూప జీవ ఎరువులు, జీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం, పంచగవ్య, ఉల్లికషాయం వంటి వాటిని వివిధ దశల్లో వాడి వరిసాగు చేపట్టారు. వరిలో అజొల్లాను చల్లడం ద్వారా కలుపు తగ్గింది. లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టల ద్వారా వరి చేనుకు హానికలిగించే కీటకాలను, దోమలను చాలా వరకూ నివారించ గలిగారు.

తోటి రైతులకు వివరిస్తున్నా...

ధాన్యాన్ని దగ్గరలోని మిల్లుద్వారా దంపుడు బియ్యంగా ఆడించి చుట్టుపక్కల గ్రామాల వారికి విక్రయిస్తున్నా. ఎకరాకు సుమారు రూ.15వేల పెట్టుబడితో రూ.50 వేల వరకూ లాభం వస్తుంది. పొలం గట్లమీద పండించిన కూరగాయలు, ఆకు కూరలను ఇంటి అవసరాలకు పోను గ్రామంలో వారికి అమ్ముతున్నా. తక్కువ పెట్టుబడితో ఏటా దిగుబడి పెరుగుతూ వస్తుంది. సమీప రైతులు సాగు గురించి వివరాలు ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని వారికి వివరిస్తున్నా.

- జి.రామకృష్ణ, వరిరైతు, విలసవిల్లి


రైతులతో కలసి నీమాస్త్రం తయారు చేస్తున్న రైతు రామకృష్ణ

ప్రశ్న సమాధానం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే



ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం పట్టినందున లంక గ్రామాల పశుపోషకులు పశువుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు **పుట్టా వీరవెంకట సుబ్బారావు** సూచించారు. పశుపోషకులు అడిగిన ప్రశ్నలకు పలు సూచనలిచ్చారు.

? ప్రశ్న: జీవాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులకు ఏం చర్యలు తీసుకోవాలి ?

- ఎం.సోమన్న, కట్టుంగ

✔ సమాధానం: జీవాలకు చీడపారుడు, నీలి నాలుక, చిటుకు వంటి వ్యాధులు సోకవచ్చు. నీలి నాలుక వ్యాధి సోకిన జీవాల నాలుక నీలిరంగులోకి మారి వాపు వచ్చి జ్వరం వస్తుంది. ఏడాదికొకసారి బ్లూటంగ్ టీకా వేయిస్తే ఈ వ్యాధి సోకదు. చీడపారుడుకు నాలుక, చిగుళ్ల మీద పుండ్లు ఏర్పడి విరేచనాలు అవుతాయి. నీరసంగా ఉండి చనిపోయే ప్రమాదం ఉంది. రోగం గమనించి యాంటిపైరెటిక్ ఇంజక్షన్లు ఇప్పించాలి.

? దూడల్లో తెల్లవిరేచనాలవుతున్నాయి. నివారణ ఎలా?

- సత్యనారాయణరాజు, ఆత్రేయపురం

✔ సమాధానం: దూడ పుట్టిన 12-18 గంటల తర్వాత తెల్ల విరేచనాలు అవుతుంటాయి. నివారణకు యాంటీ బయెటిక్ పౌడర్ అందించాలి. సెలైన్ లివర్ మందులు వాడాలి. జావ తాగించాలి. 10 కిలోల బరువున్న దూడకు ఒక లీటరు చొప్పున పాలు పట్టించాలి.

భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన చినరాజప్ప

పెద్దాపురం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని మధురపూడి విమానాశ్రయంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ఉన్నారు.


భువనేశ్వరితో మాట్లాడుతున్న చినరాజప్ప

ఏలేరు కాలువలో మృతదేహం లభ్యం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలోని ఏలేరు కాలువలో సోమవారం మృతదేహం లభ్యమైంది. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామానికి చెందిన కోలా సత్తిబాబు(56) ఆదివారం గోనేడ వద్ద ఏలేరు కాలువలో స్నానానికి దిగారు. నీటి వరద ప్రవాహానికి కొట్టుకుపోయి చివరకు కాండ్రకోట వద్ద మృతదేహమై కనిపించారు. పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది కాలువలో నుంచి బయటకు తీశారు.

కరప ఎస్సైగా సునీత బాధ్యతల స్వీకరణ

కరప, న్యూస్‌టుడే: కరప ఎస్సైగా టి.సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో లా అండర్ ఆర్డర్ విభాగంలో పనిచేసిన ఆమె కరప పోలీసుస్టేషన్‌కు బదిలీపై రాగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దాపురంలో 11 వినతులు

పెద్దాపురం: పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు వచ్చాయని ఆర్డీవో కె.శ్రీరమణి పేర్కొన్నారు. ఆయా మండలాల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల సత్వరం పరిష్కారానికై పంపినట్లు ఆమె తెలిపారు.

అక్రమ పూడ్చివేతపై ఫిర్యాదు

పెద్దాపురం: తూర్పుగోదావరి జిల్లా రంగంపేట, కాకినాడ జిల్లా గండేపల్లి మండలాలకు సంబంధించి చాగల్నాడు కాలువ అక్రమ పూడ్చివేతపై సోమవారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయానికి రైతులు వచ్చి అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు పుట్టా సోమన్న చౌదరీ మాట్లాడుతూ గండేపల్లి మండలం నాయకంపల్లి వద్ద ఒక రైతు 500 మీటర్ల పొడవునా, 10 మీటర్లు వెడల్పున పూడ్చివేయడంతో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై ఆర్డీవో కె. శ్రీరమణి సమగ్ర పరిశీలన చేసి రైతులకు తగిన న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు పాతూరి తాతమ్మ చౌదరి, వీరభద్రరావు, ముత్యాల నరసింహారావు, పుట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

ధరవరలు


అంబాజీపేట కొబ్బరి మార్కెట్


కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	12,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00




ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈవో, ఎండీ మణిమేఖలై, ఆ బ్యాంకు అధికారులు ★ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు ★ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి. చిత్రంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ తదితరులు

వరద బాధితులకు అండ

• సీఎం సహాయనిధికి పలువురు విరాళాలు

ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే యంత్రాంగం: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పలువురు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు వరద బాధితుల్ని ఆదుకోవడానికి ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్‌)కి విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను పలువురు కలిసి విరాళాల చెక్కుల్ని అందజేశారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు వేతనం

వరద బాధితుల సహాయార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ.5,90,01,087ను విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సీఈవో, ఎండీ ఎ.మణిమేఖలై సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు ఎస్.రామసుబ్రహ్మణియన్, సీవీఎన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

✦ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు రూ. కోటి విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును చంద్రబాబుకు అందజేశారు.


✦ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్‌కృష్ణమూర్తి రూ.కోటి అందజేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి ఇచ్చారు.

✦ కేరళకు చెందిన పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ రూ.50 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు ఇచ్చారు.

✦ విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ) ప్రతినిధులు రూ.50 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేశారు.

✦ బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు రూ.25 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు.

✦ శశి విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.25 లక్షల విరాళమిచ్చారు. ఈ మేరకు మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేశారు. ఆ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ తాము విద్యాసంస్థల తరఫున గతంలో రూ. కోటి విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో మరో రూ.25 లక్షలు అందించడం సంతోషకరమన్నారు.





మంత్రి లోకేశ్‌కు విరాళం అందజేస్తున్న పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ తదితరులు ★ శశివిద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తదితరులు

వ్యక్తి/సంస్థ	సాయం (రూ.లలో)
అసోసియేషన్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా	10 లక్షలు
ఎం.అప్పారావు	10 లక్షలు
చిన్మయ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్	10 లక్షలు

✦ అనంతపురానికి చెందిన కేఎం షకీల్ షఫీ నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ముతవల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7.86 లక్షల విరాళం అందించారు.

✦ జంపాల భావనారాయణ, శారద అనే వృద్ధులు రూ. లక్ష చెక్కు, 16 గ్రాముల బంగారు బ్రేస్‌లెట్‌ని వరద బాధితులకు విరాళంగా ముఖ్యమంత్రికి అందజేసి తమ ఉదారత చాటుకున్నారు.

✦ తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంకు చెందిన పాతూరి కేతన్‌చౌదరి అనే బాలుడు తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేల విరాళాన్ని సీఎంకు అందజేశాడు.



ముఖ్యమంత్రికి విరాళం ఇస్తున్న బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు తదితరులు



ముఖ్యమంత్రికి విరాళం చెక్కు, 16 గ్రాముల బంగారం అందిస్తున్న వృద్ధులు జంపాల భావనారాయణ, శారద. చిత్రంలో మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి



ఎగువ, దిగువ కాఫర్‌డ్యాం మధ్య నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన పంపులు

పోలవరానికి తగ్గిన వరద

డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో నీరు ఎత్తిపోతకు చర్యలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రంవాల్ నిర్మాణం నవంబరు నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గడంతో ప్రధాన డ్యాం ప్రాంతంలోని నీటిని పంపుల ద్వారా బయటకు ఎత్తిపోస్తుండగా.. తాజాగా మరిన్ని పంపులు ఏర్పాటు చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. దిగువ కాఫర్‌డ్యాం వద్ద సోమవారం నాటికి గుత్తేదారు సంస్థ 29 పంపులు ఏర్పాటు చేసి, నీటిని గోదావరిలోకి మళ్లిస్తున్నారు. సుమారు వంద పంపులు ఏర్పాటు చేయాలని నెల రోజుల కిందటే జలవనరుల శాఖాధికారులు నిర్దేశించగా సంస్థ ప్రణాళిక అందజేసింది. మొన్నటి వరకు రెండు కాఫర్‌డ్యాంల మధ్యనున్న నీరు డీవాటరింగ్ స్లూయిస్ నుంచి నదిలోకి వెళ్లేది. స్లూయిస్ నుంచి నీరు ఆశించిన మేర బయటకు వెళ్లకపోవడంతో పంపుల ద్వారా తోడేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెలలో విదేశీ నిపుణుల బృందం మరోసారి ప్రాజెక్టు సందర్శనకు రానుంది. ఈలోపు నీరంతా తోడివేసి, వారు సమగ్రంగా డయాఫ్రంవాల్ ప్రదేశాన్ని చూసేలా సర్వం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కొలికపూడిని సస్పెండ్ చేయాలి

ప్రధాన రహదారిపై మహిళల నిరసన



తిరువూరు మండలం చిట్టేలలో నినాదాలు చేస్తున్న మహిళలు

తిరువూరు, న్యూస్‌టుడే: మహిళా ఉద్యోగుల వాట్సాప్ నంబర్లకు అసభ్యకరంగా సందేశాలు పంపిస్తూ లైంగికంగా వేధిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును తెదేపా అధిష్ఠానం సస్పెండ్ చేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని చిట్టేలలో సోమవారం మహిళలు ప్రధాన రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళల పట్ల ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నిజం నిగ్గు తేల్చాలంటున్న ఎమ్మెల్యే: తనపై చేసిన ఆరోపణలు నిజమైతే అరెస్టు చేసి శిక్షించాలని, లేని పక్షంలో ఆరోపణలు చేసిన వారిని శిక్షించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ ఇప్పటివరకు నాలుగుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించారని, ఆమె భర్తపై పోలీసులు ఎప్పుడు కేసు పెట్టినా ఇలాంటి ఆత్మహత్య నాటకం ఆడుతారని ఆరోపించారు. తనపై పథకం ప్రకారం చేస్తున్న అసత్య ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మబోరని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలతో తన దీక్షను విరమిస్తున్నానని ప్రకటించారు.

'జగనన్న తోడు' పథకం పేరు మార్పు

ఈనాడు, అమరావతి: చిరు వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన 'జగనన్న తోడు' పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. ఆ పథకానికి 'చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు'గా పేరు పెట్టింది. జగనన్న తోడు పథకం పేరు మార్పు కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే

ఈనాడు, బెంగళూరు: ఎన్నికల బాండ్ల సేకరణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను అక్టోబరు 22వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ .. ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు దాఖలయ్యేంత వరకు ప్రాథమిక విచారణ చేపట్టటం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు ఈ స్టే అమలులో ఉంటుందన్నారు. ఐపీసీ సెక్షన్లలో బాధితులకు రక్షణ కల్పించే విధానాలున్నాయని, ఈ కేసులో ఫిర్యాదుదారుడు ఎలాంటి బాధితుడూ కాదని వివరించారు. కేవలం ఈ ఫిర్యాదు ద్వారా ఐపీసీ సెక్షన్ 383 వినియోగం గురించి వెల్లడించాలన్న అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు, భాజపా కర్ణాటక శాఖ పూర్వ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్..తనపై కేసు నమోదు చేయవద్దంటూ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ చేపట్టారు. జనాధికార సంఘ్ పరిషత్ సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ చేసిన ఫిర్యాదు మేరకు గత శుక్రవారం ప్రత్యేక కోర్టు విచారణకు ఆదేశించింది. శనివారం బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులు నిర్మలా సీతారామన్‌తో పాటు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తదితరులపై కేసు నమోదు చేశారు.





చీడిగలో దీపోత్సవంలో ఎమ్మెల్యే నానాజీ, భక్తులు.

సనాతన ధర్మ పరిరక్షణకు దీపారాధన

సర్పవరం జంక్షన్: పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో చీడిగ గ్రామంలోని దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు.

గొల్లప్రోలు: పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్తదీక్షకు మద్దతుగా గొల్లప్రోలులోని శివాలయంలో సహస్ర దీపార్చన సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ దీపార్చనలో పాల్గొన్నారు. అనంతరం ఉమా రామలింగేశ్వరస్వామికి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెంచిన అద్దెలు తగ్గించడం ఎంత వరకు సబబు?



పెద్దాపురం: మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యురాలు శ్యామలాంబ



పిఠాపురం: ఛైర్‌పర్సన్‌కు కౌన్సిలర్ల వినతి

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఎక్కడైనా అద్దెలు పెంచుతారని. . పెంచిన అద్దెలను తగ్గించడం ఎంత వరకు సబబు అని 7, 23 వార్డుల వైకాపా కౌన్సిల్ సభ్యులు విజ్జపు రాజశేఖర్, ముప్పన శ్యామలాంబ ప్రశ్నించారు. సోమవారం పురపాలక కౌన్సిల్‌హాలులో ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 22వ అంశమైన తోట గోపాలకృష్ణ పురపాలక సంఘ వాణిజ్య సముదాయాలు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వాణిజ్య సముదాయాల అద్దెలు తగ్గించడానికి కౌన్సిల్ ఆమోదం కోసం అంశాన్ని అధికారులు తీసుకొని రాగా సుదీర్ఘ చర్చ జరిగింది. ఆర్వో చంద్రశేఖర్ సమాధానమిస్తూ కోర్టు ఆదేశానుసారం కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం తీసుకొచ్చినట్లు చెప్పారు. చర్చ అనంతరం చివరకు ఈ అంశాన్ని ఆమోదించకుండా వాయిదా వేస్తూ తీర్మానించారు. పలువురు కౌన్సిలర్లు అనేక సమస్యలపై ఏకరువు పెట్టారు. కమిషనర్ కేవీ పద్మావతి, డీఈఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణమంతా నాన్ లేఅవుట్లు.. ఖాళీ స్థలాలు కబ్జా..

పిఠాపురం: పనులు చేయకుండా గుత్తేదారులు బిల్లులు చెల్లించడం ఏంటని కౌన్సిలర్లు మండిపడ్డారు. పట్టణమంతా నాన్ లేఅవుట్లు వేస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు ఇవ్వడం లేదు.. పారిశుద్ధ్యం మెరుగు పరచకపోవడంపై అధికారులను నిలదీశారు. ఛైర్‌పర్సన్ సూర్యావతి అధ్యక్షతన, కమిషనర్ ఎన్.కనకారావు ఆధ్వర్యంలో పిఠాపురం పురపాలక కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా అనేక అంశాలను ప్రస్తావిస్తూ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురంలోని 18, 23 వార్డుల్లో ప్రజలకు మంచినీరు సక్రమంగా అందడం లేదని, పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదనీ ప్రస్తావన చేశారు.

పనులు ఒక చోట.. వేతనం మరోచోట..

సామర్లకోట: పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని.. ఈ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పనులు ఒక చోట, వేతనం మరో చోట ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. సోమవారం పురపాలక సంఘ కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో, ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించారు. పలు అంశాలు చర్చకు వచ్చాయి. అనంతరం అజెండాలోని అంశాలను చర్చించి ఆమోదించారు. కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెకుముకి సైన్స్ సంబరాలు

గొల్లప్రోలు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు గొల్లప్రోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జరుగుతాయని జేవీవీ మండలాధ్యక్షుడు ఏలేటి నానిబాబు, చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు తెలిపారు. పాఠశాలస్థాయిలో విజేతలుగా నిలిచిన బృందాలు మండలస్థాయిలో జరిగే పోటీలకు హాజరు కావాలన్నారు.

భీమేశ్వరస్వామికి మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన సామర్లకోట చాళుక్య కుమారారామా భీమేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబుశర్మ, అంజిబాబు, వెంకన్న స్వామి వారికి వేదమంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాలు జరిపారు. అనంతరం అలంకరణ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సామర్లకోట: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఏపీబీసీఎల్ డీఎం రాంబాబుకు వినతిపత్రం అందించారు. సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామచంద్రరావు మాట్లాడారు.

ఆర్వోప్లాంటు బహూకరణ

సామర్లకోట: సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్షిత మంచి నీరు అందించేందుకు కాకినాడ ఓఎన్‌జీసీ యాజమాన్యం ముందుకొచ్చి ఆర్వో ప్లాంటును బహూకరించింది. సోమవారం సామర్లకోట వచ్చిన ఓఎన్‌జీసీ ప్రతినిధులు ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ఆధ్వర్యంలో హెచ్ఎం ప్రసూనకు ఆర్వో ప్లాంటును అందించారు.

దుర్గాడలో క్షుద్రపూజల కలకలం..!

గొల్లప్రోలు: దుర్గాడ - ఎ.విజయనగరం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై క్షుద్రపూజలు జరిగినట్లుగా ఉన్న ఆనవాళ్లు పరిసర గ్రామాల్లో కలకలం రేపాయి. దుర్గాడ రైల్వేగేటు అవతలి వైపున వంద మీటర్ల దూరంలో రోడ్డుపై పసుపు, కుంకుమ చల్లి మధ్యలో కోడిగుడ్లు, నిమ్మకాయలు, కొబ్బరికాయతో పాటు ప్లాస్టిక్‌బొమ్మను ఉంచడం చర్చనీయాంశమైంది.

తగ్గుముఖం పట్టిన సుద్దగడ్డ వరద

గొల్లప్రోలు: గొల్లప్రోలు నుంచి జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో గత ఐదు రోజులుగా ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సుద్దగడ్డ వరదనీరు తగ్గుముఖం పట్టింది. కొంత మేర నీటి ఉద్ధృతి తగ్గడంతో వరద నీటిలోనే కాలనీ ప్రజలు సోమవారం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సూరంపేట వెళ్లే మార్గం, తాటిపర్తి వెళ్లే పుంతరోడ్డు లోనూ పరిస్థితులు కాస్త మెరుగు పడ్డాయి.



మాట్లాడుతున్న ఏపీ టిడ్కో కార్పొరేషన్ ఛైర్మన్ అజయ్‌కుమార్

జనసేన అభ్యర్థుల విజయానికి కృషిచేయాలి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పిఠాపురం పట్టణంలోని ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ (పూర్వ అర్బన్ బ్యాంకు) ఎన్నికల్లో జనసేన తరఫున బరిలో నిలిచిన అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని ఏపీ టిడ్కో కార్పొరేషన్ ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు.

పిఠాపురం: చెందుర్తికి చెందిన కొండలరావు అనే వ్యక్తికి ఆస్ట్రేలియా జనసేన సమన్వయకర్త శశిధర్ సొంత నిధులతో సమకూర్చిన కృత్రిమ చెయ్యిను సోమవారం అజయ్‌కుమార్ బహూకరించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి		12,000
కురిడీ (వెయ్యింటికి):		
పాతకాయ:	గండేరా	17,500
	గటగట	15,500
కొత్తకాయ:	గండేరా	16,500
	గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		16,000-17,000
కొత్త (పచ్చి) కాయ		15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		3,750
కిలో		260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

అక్కడే పుట్టి.. మొదటి ఉద్యోగం చేసి.. అదేచోట పదవీ విరమణ..



వీడ్కోలు కవాతు స్వీకరిస్తున్న పిట్టా శామ్యూల్‌జాన్

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో సోమవారం పిట్టా శామ్యూల్ జాన్ ఎఫ్ఏసీ కమాండెంట్ హోదాలో సోమవారం పదవీ విరమణ చేశారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఆయన గౌరవార్థం వీడ్కోలు కవాతు నిర్వహించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎల్.అర్జున్ ఆధ్వర్యంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది చేతుల మీదుగా శామ్యూల్‌జాన్, జయంతి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శామ్యూల్‌జాన్ మాట్లాడుతూ.. ఇక్కడే పుట్టి, ఇక్కడే మొదటి ఉద్యోగం చేసిన తాను.. అదేచోట పదవీ విరమణ చేయడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు.